ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5

శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు

సోమవారం 7 ఏప్రిల్ 2025



నగరంలోని శబరిశ్రీరామక్షేత్రంలో నిర్వహించిన సీతారాముల కల్యాణోత్సవంతో తాళిబొట్టు చూపుతున్న అర్చకులు







ఊరూ, వాడా ఘనంగా సీతారామ కల్యాణాలు

వైభవంగా శ్రీరామనవమి వేడుకలు

జైజై రామ జానకిరామా!

జిల్లా వ్యాప్తంగా ఆదివారం శ్రీరామనవమి వేడుకలు వైభవంగా జరిగాయి. పచ్చని తోరణాలు, చలువ పందిళ్ల లోగిళ్లలో భక్తుల నామస్మరణ మధ్య సీతారాముల కల్యాణాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. శ్రీవిశ్వావసు నామ సంవత్సరంలో రాములోరి కల్యాణం తిలకించినవారికి సూర్యభగవానుడి ఆశీస్సులు కలుగుతాయన్న విశ్వాసంతో భక్తులు పెద్ద ఎత్తున ఆలయాలకు తరలివచ్చారు. నెల్లూరు, ఆత్మకూరు, కావలి, కందుకూరు డివిజన్లలోని అన్నీ గ్రామాల్లోనూ రాములోరి పెళ్లిళ్లు జరిగాయి. నగరంలోని శబరి శ్రీరామక్షేత్రం ఆధ్వర్యంలో జరిగిన సీతారాములు కల్యాణోత్సవానికి నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, సుజిత దంపతులు హాజరై స్వామివారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. అలాగే పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు సమీపంలోని ఆలయాల్లో జరిగిన స్వామివారి కల్యాణాలకు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పలు ఆలయాల్లో ప్రసాదాలుగా వడపప్పు, పానకం, పులిహోర పంపిణీ చేశారు. పెద్ద ఎత్తున అన్న ప్రసాద వితరణ జరిగింది. భక్తులు వేలాదిగా తరలివచ్చారు.

- నెల్లూరు (సాంస్కృతికం) (ఆంధ్రజ్యోతి)



కల్యాణం అనంతరం సీతారాములకు నిర్వహించిన పుష్పయాగం



వెంకటాచలం మండలం శ్రీరామపురంలో జరిగిన సీతారాముల కల్యాణంలో పాల్గొన్న పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, కుటుంబసభ్యులు



నగరంలోని బాలాజీనగర్‌లో సాగుతున్న అద్దాల మందిరం సాయిబాబా రథోత్సవం

కావాలి నిధులు..
కదలాలి పనులు

బిల్లుల పెండింగ్‌తో కీలక వర్కులకు బ్రేక్ • జాబితాలో ఆప్రాన్, హైలెవల్, ఎస్‌కేఎఫ్‌ఎఫ్, కాజ్‌వే

• ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుంటేనే ఫలితం

కీలక ప్రాజెక్టుల పనులకు నిధుల కొరతతో బ్రేకులు పడ్డాయి. గత కొన్ని నెలలుగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. కొంతమేర బిల్లులు ఇచ్చినా, ఇంకా రావాల్సిన బిల్లులు ఉండటంతో పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. ఈ ప్రాజెక్టుల్లో చాలా వరకూ ఇరిగేషన్‌కు సంబంధించినవే ఉన్నాయి. ఇవి పూర్తయితే వేల ఎకరాల ఆయకట్టు సాగులోకి రావడంతోపాటు మరికొన్ని వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుంది. వైసీపీ ప్రభుత్వంలో అడుగు ముందుకు పడని ఈ ప్రాజెక్టుల పనుల్లో కూటమి ప్రభుత్వం వచ్చాక కదలిక వచ్చింది. పెండింగ్ బిల్లులను చెల్లించినా ఈ మధ్యలో చేసిన పనులకు బిల్లులు అందాల్సి ఉంది. ఈ కారణంగానే కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు భయపడుతున్నారు.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)

సోమశిల ఆప్రాన్ దెబ్బతినడంతో ప్రాజెక్టుకే ముప్పు ఏర్పడింది. 2022లో ఈ పనులు మొదలుపెట్టినా ఇంకా సగం కూడా పూర్తి కాలేదు. గత ప్రభుత్వంలో రూ.20 కోట్ల మేర పనులు జరగ్గా ఆ బిల్లులను అప్పటి ప్రభుత్వం ఇవ్వలేదు. దీంతో కాంట్రాక్టర్ ఏడాదిన్నరపాటు పనులు నిలిపేశారు. కూటమి వచ్చాక స్వయంగా సీఎం చంద్రబాబునాయుడు ఆప్రాన్ పనులను పరిశీలించారు. ఆ వెంటనే కాంట్రాక్టర్‌కు పెండింగ్ బిల్లులు చెల్లించడంతో పనులు పునఃప్రారంభమయ్యాయి. ఇప్పటి వరకూ 30 శాతం మేర పనులు జరిగినట్లు ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. కాంట్రాక్టర్‌కు మరో రూ.7 కోట్ల మేర బిల్లులు రావాల్సి ఉంది. ఆ కారణంతోనే రెండు నెలలుగా ఆప్రాన్ పనులు ఆగిపోయి ఉన్నాయి. సోమశిల- కండలేరు వరద కాలువ (ఎస్‌కేఎఫ్‌ఎఫ్ కెనాల్), జీకేఎన్ కెనాల్ (ఉత్తర కాలువ)ను విస్తరించేందుకు 2021లో రూ.1300 కోట్లతో మొదలుపెట్టారు. ఈ రెండు కాలువలకు ప్రస్తుతమున్న ఫ్లో కెపాసిటీని డబుల్ చేయాలన్నది ఉద్దేశం. ఒక్క ఎస్‌కేఎఫ్‌ఎఫ్ కెనాల్‌నే రూ.778 కోట్లతో చేస్తుండగా ఇప్పటి వరకూ సుమారు రూ.200 కోట్ల మేర పనులు జరిగినట్లు ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. గత ప్రభుత్వం నుంచి బిల్లులు పెండింగ్ ఉండటంతో పనులు సాఫీగా జరగడం లేదు. ఈ పనులకు కూడా రూ.14 కోట్ల వరకూ బిల్లులు చెల్లించాల్సి ఉందని, అవి చెల్లించిన తర్వాతనే పనులు మొదలు పెడతామని కాంట్రాక్టర్ చెబుతున్నారు. ముదివర్తి-ముదివర్తి పాలెం కాజ్‌వే కూడా బిల్లుల పెండింగ్‌తో కొన్ని నెలల నుంచి ముందుకు కదలడం లేదు. సుమారు రూ.100 కోట్లతో కాజ్‌వే పనులు మొదలుపెట్టగా సుమారు రూ.20 కోట్ల మేర పనులు చేశారు. అయితే కాంట్రాక్టర్‌కు ఒక్క బిల్లు కూడా రాలేదని అధికారులు చెబుతున్నారు. ఈ కారణంతోనే కాంట్రాక్టర్ పనులు చేయడం లేదని అంటున్నారు. ఇవే కాదు.. మలిదేవి డ్రెయిన్ ఆధునికీకరణ, బండేపల్లి - దేగపూడి కాలువ, డీఆర్-డీఎం ఛానెల్ ఆధునికీకరణ పనులతోపాటు కీలకమైన ఎన్డీబీ రోడ్డు వర్కులు కూడా బిల్లుల పెండింగ్ జాబితాలో ఉన్నాయి. కొన్ని వర్కులు పూర్తిగా ఆగిపోగా, మరికొన్ని వర్కులు ఒక అడుగు ముందుకు మూడడుగులు వెనక్కు అన్నట్లు సాగుతున్నాయి.



సోమశిల జలాశయం ముందు ఆగిన ఆప్రాన్ పనులు (ఫైల్)

సీఎం దృష్టికి తీసుకెళ్లిన కలెక్టర్

ఇరిగేషన్ పనులు వేగంగా చేయడానికి వేసవి కాలం అనువైనది. వర్షాలు ఉండవు కాబట్టి పనులకు అంతరాయం ఏర్పడదు. అదే సమయంలో కొన్ని చోట్ల సాగు కూడా ఉండదు కాబట్టి రైతాంగానికి కూడా ఇబ్బందులు ఉండవు. ఈ నేపథ్యంలో ఇటీవల కలెక్టర్ ఆనంద్ కీలక ప్రాజెక్టులకు నిధుల అవసరాన్ని కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ప్రస్తావించారు. సోమశిల ఆప్రాన్, హైలెవల్ కెనాల్ నిర్మాణాలకు అవసరమైన నిధులను సమకూర్చాలని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన సీఎం ఈ అంశంపై తనతో ప్రత్యేకంగా చర్చించాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. దీంతో పెండింగ్ బిల్లుల విడుదలపై కదలిక వచ్చినట్లయింది. ఇదే సమయంలో జిల్లాలోని ప్రజాప్రతినిధులు కూడా కీలక ప్రాజెక్టులకు ఉన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఒత్తిడి తీసుకురాగలిగితే ఫలితం దక్కుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

దొంగలున్నారు జాగ్రత్త !


• వేసవిలో అప్రమత్తంగా లేకుంటే దోచేస్తారు... • ఆభరణాలు ధరించి, ఆరుబయట నిద్రించవద్దు

• లాక్డ్ హౌస్ మానటరింగ్ సిస్టమ్‌ను వినియోగించుకోవాలి

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): వేసవి వచ్చిందంటే దొంగలకు కూడా సీజన్ ప్రారంభమైనట్లే. సెలవుల్లో అనేకమంది ఇప్పుడిప్పుడే సొంతూర్లకు, షికార్లకు, బంధువుల ఇళ్లకు వెళుతున్నారు. ఈ క్రమంలో అప్రమత్తంగా లేకుంటే, ఇదే అవకాశంగా దొంగలు ఇళ్లను దోచేస్తున్నారు. రాత్రిళ్లు ప్రజలు ఆరుబయట, మిద్దెలపై నిద్రిస్తున్న సమయంలోనూ, ఇళ్లకు తాళాలు వేసి ఊర్లకు వెళుతున్నప్పుడు గమనించి,చోరులు తమ పని కాని చేస్తున్నారు. ముఖ్యంగా నెల్లూరు నగరంలో వేసవి దొంగతనాలు ఎక్కువగా జరుగుతూ, నగర వాసులకు కంటిపై కునులేకుండా చేస్తున్నాయి.

జాగ్రత్తలు తప్పనిసరి

- వేసవిలో మహిళలు బంగారు, వెండి ఆభరణాలు ధరించి, ఇంటి బయటకానీ, మిద్దెపై కానీ నిద్రించవద్దు.
- ఇంట్లో పడుకున్నప్పుడు లోపల డోర్‌లాక్ చేయడం మరిచిపోరాదు.
- ఇంట్లో వారంతా ఊరు వెళ్లవలసి వస్తే, విలువైన బంగారు, వెండి ఆభరణాలను, నగదును బ్యాంకు లాకరులో భద్రపరచాలి. లేదంటే వెంట తీసుకెళ్లాలి.
- బయట ఊర్లకు వెళ్లేటప్పుడు ముందుగా పోలీసులకు సమాచారం ఇస్తే, లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్(ఎల్‌హెచ్‌ఎంఎస్)ను ఏర్పాటు చేసి, చోరీలు జరగకుండా పర్యవేక్షిస్తారు.



- అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే, వెంటనే 112 నెంబరుకు ఫోన్ చేసి సమాచారం అందించాలి.

యాప్‌ను ఎలా వినియోగించుకోవాలి ?

ముందుగా ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌లోకి వెళ్లి రిక్వె స్టు పోలీసు వాచ్‌ను ఎంపిక చేసుకోవాలి. ఏ తేదీన ఏ సమయానికి ఊరు వెళుతు న్నారు... ఎప్పుడు తిరిగి వస్తారు ... అన్న వివరాలను యాప్‌లో పొందుపరచాలి. వెంటనే ఆ సమాచారం జిల్లా పోలీసు కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌కు చేరుతుంది. అక్కడ సిబ్బంది ఆ ఇంటికి వైఫైతో పనిచేసే నిఘా కెమెరాలను అమర్చుతారు. ఆ ఇంట్లో ఎలాంటి కదలికలున్నా కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సైరన్ మోగుతోంది. వెంటనే సంబంధిత పోలీసు స్టేషన్, రక్షక్, బ్లూకోట్స్ వాహనాలకు సమాచారం వెళ్తుంది. దీంతో పోలీసులు వెంటనే అక్కడికి చేరుకొని దొంగలను పట్టుకునేందుకు అవకాశం ఉంటుంది.

ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం...

వేసవిలో జరిగే చోరీలపై ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. వేసవి సెలవుల్లో సొంతూర్లకు వెళ్లే ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్ సేవలను వినియోగించుకోవాలి.

- జీ కృష్ణకాంత్, జిల్లా ఎస్పీ





వాహనంలో తరలిస్తున్న ఆవు

నెల్లూరులో గోవధ ముఠాలు

ఆవులను అపహరించి, కోతకు తరలింపు

వారాంతంలో రంగంలోకి మాఫియా

ఒక్కొక్కటి రూ. 20 వేల నుంచి రూ.30 వేలకు విక్రయం

నాలుగు ప్రాంతాల నుంచి మాంసం ఎగుమతి

నెల్లూరు(సిటీ), ఏప్రిల్ 6, (ఆంధ్రజ్యోతి): నగరంలో గోవధ ముఠాల ఆగడాలు ఎక్కువయ్యాయి. రోడ్లపై తిరిగే ఆవులను అపహరించి, కోతకు తరలిస్తున్నారు. రోడ్లపై గోసంచారం ప్రయాణికులకు ఇబ్బందిగా మారిందని కార్పొరేషన్ సిబ్బంది వాటిని పట్టుకెళ్లి కల్లూరిపల్లిలోని గోశాలలో ఉంచుతున్నారు. కొందరు ఆ ముసుగులో ఆవులను అపహరించుకెళ్లి మాంసం విక్రయదారులకు అమ్మేస్తున్నారు. వారాంతపు రోజులైన శుక్ర, శనివారాల్లో ఈ ముఠాలు రోడ్లపై తిరిగే ఆవులను తీసుకెళ్లి ఒక్కొక్క దాన్ని రూ. 20 నుంచి రూ.30 వేలకు అమ్ముకుంటున్నారు. నగరంలోని నాలుగు ప్రాంతాల్లో ఆవులను వధించి, ఆ మాంసాన్ని ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు.

• కార్పొరేషన్ సిబ్బంది ముసుగులో...

రోడ్లపై ఉండే ఆవులను మున్సిపల్ సిబ్బంది కల్లూరిపల్లిలోని గోశాలకు తరలిస్తున్నారు. ఇందుకు ప్రత్యేక వాహనాలను వినియోగిస్తున్నారు. ఈ వ్యవహారం ఆవులను అపహరించే ముఠాకు అనుకూలంగా మారింది. ముందుగా నగరంలో ఎక్కడెక్కడ ఆవులు ఉన్నాయో రెక్కీ నిర్వహించి, ఆ తరువాత కార్పొరేషన్ సిబ్బంది ముసుగులో రంగంలోకి దిగి వాహనాల్లో ఎక్కించుకుని పోతున్నారు. ఎవరైనా అడిగినా తాము ఎస్ఎంసీ సిబ్బందంటూ చెప్తున్నారు. ఇలా తోలుకెళ్లిన ఆవు సైజును బట్టి ఒక్కొక్క దాన్ని రూ. 20 వేల నుంచి రూ. 30 వేలకు అమ్ముకుంటున్నట్లు సమాచారం. దీంతో పలువురు యజమానులు నగరంలోని వివిధ స్టేషన్లలో ఫిర్యాదులు కూడా చేసినట్లు తెలిసింది.

• నాలుగు ప్రాంతాల నుంచి మాంసం ఎగుమతి

నగర శివార్లలోని నాలుగు ప్రాంతాల్లో ఆవులను వధించి, వాటి మాంసాన్ని ఎగుమతి చేస్తున్నట్లు ఇప్పటికే కార్పొరేషన్ అధికారులు గుర్తించారు. ఇటీవల ఎన్టీఆర్‌నగర్ ఎదురుగా ఉన్న ఓ లేఅవుట్లలో ఆటోలో తీసుకువచ్చిన సుమారు ఐదు టన్నుల ఆవు మాంసాన్ని లారీకి లోడ్ చేస్తుండగా పోలీసులు, ఎస్ఎంసీ అధికారులు పట్టుకున్నారు. దీన్ని కేరళకు తరలించేందుకు సిద్ధమైనట్లు సమాచారం. నగరంలోని బోడిగాడితోట, షైపాడుగేట్ సమీపం, వైఎస్ఆర్‌నగర్, ఆటోనగర్ ప్రాంతాలకు ఆవులను తీసుకువచ్చి చంపి, మాంసం ఎగుమతులు చేస్తున్నట్లు తెలుస్తున్నది. వీళ్లకి ఎలాంటి అనుమతులు లేకపోయినా దందా మాత్రం యథేచ్ఛగా సాగడంపై పలు అనుమానాలు కలుగుతున్నాయి.

బుజబుజనెల్లూరులోని తల్పగిరి కాలనీలో ఉండే భూషయ్య రోజూ తన ఆవును మేతకు బయటకు వదులుతాడు. శుక్ర, శనివారాల్లో కూడా అలాగే వదిలాడు, కానీ అది తిరిగి ఇంటికి రాలేదు. చుట్టుపక్కల గాలించి కార్పొరేషన్ సిబ్బంది పట్టుకెళ్లారని గ్రహించి, గోశాలకు వెళ్లిచూశాడు. అయితే అది అక్కడలేదు. ఏమైందని ఆరా తీయగా, అతడిని వెంకటయ్య అనేవ్యక్తి తారసపడి, నీ ఆవును కసాయి ముఠా తోలుకెళ్లి ఉంటుందని, వెతకడం మానుకోమని సలహా ఇచ్చాడు. ఇలా అనేకమంది ఆవులు ఇటీవల కాలంలో చోరీకి గురయ్యాయి. నగరంతోపాటు శివారు ప్రాంతాల్లోనూ ఆవులను అపహరించే ముఠాలు సంచరిస్తున్నట్లు ఈ సంఘటనను బట్టి తెలుస్తోంది.

'బెల్టు' వేలం రూ. 1.50 లక్షలు

• అంకభూపాలపురంలో ఘటన

వలేటివారిపాలెం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకభూపాలపురంలోని ఓ ఆలయంలో మూడు రోజుల క్రితం గ్రామస్థులు బెల్టుషాపునకు వేలం నిర్వహించారు. అదే గ్రామానికి చెందిన ప్రగడ సత్యనారాయణ రూ.1.50 లక్షలకు వేలం పాడినట్లు సమాచారం. గత ఏడాది రూ.50 వేలకు పోయిన వేలం, ఈ ఏడాది రూ.1.50లక్షలకు పోయింది. వేలం ద్వారా వచ్చిన నగదును గ్రామంలో పండుగలు, జాతరలకు ఉపయోగించనున్నట్లు గ్రామస్థులు తెలిపారు. బెల్టు షాపులో ఒక్కో మద్యం సీసాపై ఎమ్మార్పీ కంటే రూ. 50 అదనంగా అమ్ముతున్నట్లు సమాచారం. కాగా గ్రామంలో బెల్టుషాపునకు పాట పెట్టింది తనకు తెలియదని ఎక్సైజ్ సీఐ వెంకట్రావు పేర్కొన్నారు.తనిఖీలు నిర్వహించి చర్యలు చేపడతామన్నారు.

తాగునీరు విడుదల

లింగసముద్రం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి) : మూడు రోజుల క్రితం సంపుల శుభ్రం చేయడం, వాల్వ్‌ల మరమ్మతుల కారణంగా రాళ్లపాడు- రేళ్లపాడు మంచినీటి పథకం నుంచి ఆపిన మంచినీటి సరఫరాను ఆదివారం ఉదయం నుంచి పునరుద్ధరించారు. శనివారం రాత్రి ఈ పథకం వాల్వ్‌లను పెంట్రాలలోని ఫిల్టర్ పాయింట్‌లోని సంపులకు బిగించి, నీటిని పంపింగ్ చేసి ట్యాంకుల ద్వారా ప్రజలకు అందించారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కమనీయం.. సీతారాముల కల్యాణం



ఉలవపాడు : సీతారాముల కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే ఇంటూరి

ఉలవపాడు, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమిని పురస్కరించుకుని ఆదివారం రామాలయాల్లో రాములోరి కల్యాణోత్సవం కమనీయంగా జరిగింది. మండలంలోని చాకిచర్ల శ్రీశ్రీనగర్ ఎస్సీ కాలనీ, పెద్దపట్టపు పాలెం గ్రామాల్లో జరిగిన సీతారాముల కల్యాణోత్సవంలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. అలాగే ఉలవపాడు, కరేడు, బద్దిపూడి, భీమవరం, ఆత్మకూరు గ్రామాల్లోని రామాలయాల్లో స్వామివారి కల్యాణంలో భక్తులు పాల్గొని పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. రాత్రి గ్రామోత్సవం జరిగింది.

కావలిటౌన్ : కావలి పట్టణంలోని దక్షిణంపేట రామాలయం, జనతాపేట రామాలయం, సత్యనారాయణస్వామి ఆలయం, అన్నపూర్ణ క్లాత్ మార్కెట్, వడ్డిపాలెం, వెంగళరావునగర్ రామాలయాల్లో సీతారాముల కల్యాణ మహోత్సవాలు వైభవంగా జరగాయి. భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమాలు చేపట్టారు. కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి పలు ఆలయాలు సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించి కల్యాణమహోత్సవాన్ని తిలకించారు.

కావలిరూరల్ : మండలంలోని పలు గ్రామాల్లో ఆలయాలను విద్యుత్ దీపాలు పచ్చతోరణాలతో అలంకరించారు. రామాలయాలు లేని అనేక చోట్ల చలువ పందిళ్లలో స్వామివారి చిత్రపటాలు ఉంచి పూజలు నిర్వహించారు. ముసునూరు ఇందిరమ్మకాలనీ శ్రీరామ్ నగర్‌లో ఉన్న భద్రాది సీతారామచంద్రస్వామి ఆలయంలో ఆలయ కమిటీ సభ్యులు గన్నంరెడ్డి వెంకట శేషారెడ్డి, బైసాని ధనేష్ గుప్త ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. అదే ప్రాంతంలోని వినాయక మండపం దగ్గర స్వామివారి కల్యాణ వేడుక వైభవంగా జరిగిన అనంతరం స్వామి వారి ఊరేగింపు నిర్వహించారు.

కందుకూరు : రామాలయాలు భక్తుల రామనామస్మరణలతో మార్మోగాయి. సీతారాముల కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తులకు సామూహిక అన్నప్రసాద కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని రెవిన్యూ కాలనీ, పెద్దబజారు రామాలయం, నందావారివీధి, ఏకలవ్యనగర్, పామూరు రోడ్డులోని రామాలయాల్లో సీతారాముల కల్యాణోత్సవాన్ని వేడుకగా నిర్వహించగా వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

కలిగిరి : మండలంలోని ఆలయాల వద్ద చలువపందిళ్ల కింద జరిగిన సీతారామ కల్యాణోత్సవాలను భక్తులు తిలకించారు.

బిట్రగుంట : విశ్వనాథరావుపేట రైల్వే ట్రాఫిక్ రామాలయంలో సీతారాముల కల్యాణం నిర్వహించారు. బిట్రగుంట రైల్వే పీడబ్ల్యూఐ కార్యాలయం నుంచి పట్టువస్త్రాలు, మంగళసూత్రం, తలంబ్రాలు అందచేశారు. బోగోలు విజయగణపతి ఆలయంలో స్వామి అమ్మవార్ల చిత్రపటాలను ఉంచి ప్రత్యేక పూజలు చేశారు.

దగదర్తి(బిట్రగుంట): దగదర్తి మండలం మనబోలుపాడు కోదండరామాలయంలో సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. ఉభయకర్తలుగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరి, ఉమాప్రియ దంపతులు వ్యవహరించారు. స్వామి అమ్మవార్లకు పట్టు వస్త్రాలు, తలంబ్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అల్లం హనుమంతరావు, న్యాయవాది కొండూరు శేషారెడ్డి, జలదంకి శ్రీహరి, పులి శీనయ్య, పాపన మల్లికార్జునరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఉదయగిరి సుద్ధబావివీధి రామాలయం ఆవరణలో కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

కొండాపురం: ఇస్కుదామెర్ల పంచాయతీ పొట్టిపల్లి, గుడవళ్లూరు, శాయిపేట, భీమవరప్పాడు తదితర గ్రామాల్లో సీతా రాముల విగ్రహాలకు ప్రత్యేకపూజలు, అభిషేకాలు నిర్వహించి కల్యాణ వేడుకలను వైభవంగా నిర్వహించారు.

అల్లూరు : అల్లూరు, నార్తుమోపూరుల్లోని రామాలయాల్లో ఆది దంపతుల కల్యాణం వైభవంగా జరిగింది. భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని వీక్షించారు. అల్లూరుపేటలోని కోదండరామస్వామి ఆలయంలో ఆలయ ధర్మకర్తల వంశస్థులైన అల్లంపాటి లోకేష్, హాసిని దంపతులు, అల్లంపాటి ఇందిరమ్మలు పాల్గొన్నారు.

జలదంకి : మండలంలోని రామమందిరాల ముంగిట చలువ పందిళ్లు వేసి సీతారాముల కల్యాణాలు వేదమంత్రోచ్ఛరణాల మధ్య నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించారు.



కందుకూరు నందావారివీధిలోని రామాలయంలో సీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు



ఆత్మకూరు పట్టణంలోని కోదండరామాలయంలో సీతారామ కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పలేటివారిపాలెం: పలేటివారిపాలెం వడ్డెపాలెంలో ముత్యాల తలంబ్రాలతో సీతారాముల కల్యాణాన్ని కమనీయంగా నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు. భక్తులు భక్తిశ్రద్ధలతో రామాలయాలకు వెళ్లి పూజలు చేసి సీతారాముల కల్యాణం తిలకించారు.

లింగసముద్రం: పెదపవని, చినపవని, లింగసముద్రం, వీఆర్ కోట తదితర గ్రామాల్లో భక్తులు కోదండరాముని దేవాలయాలను సందర్శించి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు.

ఆత్మకూరు: ఆత్మకూరు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఆదివారం శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆత్మకూరు పట్టణంలోని ఎల్ఆర్‌పల్లి, పంటవీధి, కన్యకాపరమేశ్వరి ఆలయంలోని కోదండరామస్వామి ఆలయాల్లో, కాశినాయన ఆశ్రమంలో, అరుంధతీపాళెం తదితర ప్రాంతాలలో సీతారాముల కల్యాణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలోని నెల్లూరుపాళెం, అశోకనగర్, పిడుగురంగయ్యవీధి, మండలంలోని దేపూరు, మహిమలూరు గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

సంగం : మండల కేంద్రం శివాజీ సెంటర్‌లోని రామ మందిరం, ఆంజనేయస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. పెరమన, జంగాలదొరువు, కొరిమెర్ల, ఉడ్‌హౌస్‌పేట, తరుణవాయి, వంగల్లు, జండాదిబ్బ, అనుసూయనగర్, పల్లిపాళెం, మర్రిపాడు తదితర రామాలయాల్లో నవమి వేడుకలను నిర్వహించారు.



కావలి బ్రిడ్జి దిగువలోని రామమందిరంలో జరిగిన సీతారాముల కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

అనంతసాగరం: మండలంలోని వరికుంటపాడు, అగ్రహారం, అనంతసాగరం చెరువు కట్ట వద్ద ఉన్న కోదండరామస్వామి ఆలయాల్లో శ్రీరామనవమి ఉత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారి కల్యాణం జరిపారు.

ఏఎస్‌పేట : అనుమసముద్రం, చిరమన, శ్రీకోలను, రాజవోలు, దుబగుంట గ్రామాలతో పాటు మండలంలోని అన్ని గ్రామాలలో శ్రీరామనవమి వేడులను ఘనంగా నిర్వహించారు. సీతారాముల కల్యాణం వైభవంగా జరిపారు.

ఉదయగిరి: పట్టణంలోని సుద్ధబావివీధిలో ఉన్న రామాలయంలో స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. అలాగే స్థానిక ఆంజనేయస్వామి ఆలయం, మండలంలోని పలు గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలు జరిపారు.

దుత్తలూరు: మండలంలోని దుత్తలూరు గ్రామంలో నిర్వహించిన సీతారాముల కల్యాణోత్సవంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, అనసూయమ్మ దంపతులు పాల్గొన్నారు. అలాగే సోమలరేగడ, లక్ష్మీపురం, నందిపాడు, నర్రవాడ, బ్రహ్మేశ్వరం, కొత్తపేడ, తెడ్డుపాడు, రెడ్లదిన్నె తదితర గ్రామాల్లో కల్యాణోత్సవాలు, పూజలు చేపట్టారు.

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్): మండలంలోని వరికుంటపాడు, పెద్దిరెడ్డిపల్లి, కనియంపాడు, తూర్పురొంపిదొడ్ల తదితర గ్రామాల్లో సీతారాముల కల్యాణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం స్వామివార్లను గ్రామోత్సవం నిర్వహించారు.

వింజమూరు : చెన్నకేశవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పట్టణ పురవీధుల్లో స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. అలాగే వైశ్యబజార్‌లో రాములవారి గుడిలో కొండ చంద్రమౌళీ కుటుంబ సభ్యులచే సీతారాముల కల్యాణం నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

సీతారామపురం: మండలంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పడమటివీధి రాములవారి ఆలయం నుంచి పానకం బండి ఊరేగింపుతో గ్రామ దేవత అంకాలమ్మ గుడి వద్దకు వెళ్లి అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు పానకం, వడపప్పు, ప్రసాదం పంచారు. అదేవిధంగా రాజుగారి వీధిలో నూతనంగా నిర్మిస్తున్న సీతారామ దేవస్థానం వద్ద పాలగిరి శివ కుమార్ జ్ఞాపకార్థం ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు.



కావలిరూరల్ : వినాయక మండపం సెంటర్‌లో ఊరేగుతున్న దేవతా మూర్తులకు

ఎన్నికల హామీలు తప్పక నెరవేరుస్తాం : ఎంపీ వేమిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి

ఉలవపాడు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తప్పకుండా కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుందని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని పెద పట్టపుపాలెంలో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వర రావుతో కలసి పర్యటించిన ఎంపీ అక్కడ ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. ఎన్నికల ప్రచార సమయంలో పెద్దపట్టపుపాలెం ప్రజలు చూపిన ఆదరణ మరువలేదని, అందుకే గెలిచాక మళ్లీ శ్రీరామ నవమి వేడుకలకు వస్తానని చెప్పిన తాను ఈరోజు స్వామివారి కల్యాణోత్సవంలో పాల్గొన్నానన్నారు. గ్రామస్థులు పలు సమస్యలు తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. బకింగ్‌హోమ్ కెనాల్ దాటి సముద్రంలోకి వెళ్లేందుకు బ్రిడ్జి ఏర్పాటు చేయాలని, చెరువు పూడికతీత, కాలువల పనులు చేపట్టాలని చేసిన విజ్ఞప్తి మర్చిపోలేదని, స్థానిక ఎమ్మెల్యే నాగేశ్వరరావుతో కలిసి సమస్యలు పరిష్కరించేలా కృషి చేస్తానన్నారు. వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ట్రై సైకిళ్ల పంపిణీ నిరంతర ప్రక్రియ అని, నియోజకవర్గంలో ఇంకా ఎవరైనా ట్రై సైకిళ్లు అందకపోతే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రాభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళుతున్నారని, సుపరిపాలన అందిస్తున్నారని కొనియాడారు. చాకిచర్ల శ్రీశ్రీకాలనీలో అసంపూర్తిగా ఉన్న రామాలయం నిర్మాణం పూర్తి చేసే బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. కాగా అంబేద్కర్ జయంతిరోజున ఆటల పోటీల నిర్వహణ, భోజనాలకు రూ.70,000 విరాళం అందచేశారు. కార్యకర్తల మధ్య ఉండే చిన్నచిన్న సమస్యలు పరిష్కరించుకొని కలిసికట్టుగా ముందుకు సాగితే తిరిగి 2029లో కూడా విజయం మనదేనని ఆయన స్పష్టంచేశారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎంపీ వేమిరెడ్డి సహకారంతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. పెద్దపట్టపుపాలెంలో రూ.30లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టామని, భవిష్యత్తులో మరెన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

ఇష్టంగా చదివితే జీవితం సుఖమయం : ఎమ్మెల్యే దగుమాటి

కావలి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): ఇష్టంతో కష్టపడి చదివితే జీవితం సుఖమయం అవుతోందని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. స్థానిక విశ్వశాంతి హైస్కూల్‌లో శనివారం రాత్రి జరిగిన ఆ స్కూల్ 34వ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. అనంతరం పాఠశాలలో వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందచేశారు. అనంతరం పాఠశాల యాజమాన్యం ఎమ్మెల్యేను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ డీవీ రమణయ్య, టీడీపీ నాయకులు గంగినేని వెంకటేశ్వర్లు, బొట్లగుంట హరిబాబు, మంచాల ప్రసాద్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

సంగం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెలుగు కేంద్రంలో మహిళల ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని దేవదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సోమవారం సాయంత్రం 5 గంటలకు ప్రారంభిస్తారని ఎంపీడీవో షాలెట్ ఒక ప్రకటనలో తెలిపారు. కుట్టు శిక్షణకు ఎంపికైన మహిళలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

టీడీపీ కార్యకర్తలకు సభ్యత్వ కార్డుల అందజేత



ఉదయగిరి: కార్యకర్తలకు సభ్యత్వ నమోదు కార్డులు అందజేస్తున్న బయ్యన్న

ఉదయగిరి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్డులు కార్యకర్తలకు అందచేస్తున్నట్లు మండల టీడీపీ కన్వీనర్ చింతనబోయిన ఆదివారం పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 36 బూత్‌లకు సంబంధించి సుమారు 11వేల సభ్యత్వ కార్డులు, ట్యాగులు అం దాయని, వీటిని కార్యకర్తలకు అందచేస్తామన్నారు. ఈకార్యక్రమంలో టీడీపీ నేతలు బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, మతకాల శ్రీనివాసులయాదవ్, చింతనబోయిన శివకృష్ణ, రామ్మోహన్ పాల్గొన్నారు.

● వింజమూరు : స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం పార్టీ సభ్యత్వ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు గొంగటి రఘునాథరెడ్డి క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, బూత్ కన్వీనర్లకు కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి చల్లా వెంకటేశ్వర్లుయాదవ్, మాజీ కన్వీనర్ గూడా నర్సారెడ్డి, నాయకులు మంచాల శ్రీనివాసులు నాయుడు, కొండపల్లి వెంకటేశ్వర్లు, దుద్దుగుంట శ్రీనివాసులు, అంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

● సీతారామపురం: మండల కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం కార్యాలయ సిబ్బంది అంకబాబు, మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్ రాజు ఆధ్వర్యంలో క్లస్టర్ ఇన్‌చార్జ్, యూనిట్ బూత్ ఇన్‌చార్జ్‌లకు బూత్‌లవారీగా సభ్యత్వ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి పిడుగు రమేష్, మాజీ జడ్పిటిసి కలివెల జ్యోతి, మండల తెలుగు యువత అధ్యక్షుడు ఎడమ ప్రవీణ్, జిల్లా ఎస్సీ సెల్ కార్యనిర్వాహక అధికార ప్రతినిధి జాషువా, ఇబ్రాయిల్, దేవర వెంకటేశ్వర్లు, వికాస్‌బాబు,ంఘు, కిరణ్, రాజేష్, రాజశేఖర్ పాల్గొన్నారు.

రామాలయంలో ఉత్సవాలకు విరాళం అందజేత



నిర్వాహకులకు నగదు అందజేస్తున్న టీడీపీ నేతలు

ఉదయగిరి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సుద్దబావి వీధి రామాలయంలో ఉత్సవాలకు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ రూ.20 వేలు విరాళం అందజేశారు. స్వామివారి కల్యాణోత్సవం, అన్నప్రసాద వితరణ కోసం ఈ నగదును ఆదివారం ఆయన ప్రతినిధులు గడ్డం కొండలరావు, తుమ్మల కిరణ్ నిర్వాహకులకు అందించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ చింతనబోయిన బయ్యన్న, మైనారిటీ నాయకులు షేక్ రియాజ్, సయ్యద్ సందానీ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నగర సంకీర్తన

కలువాయి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా స్థానిక హిందూధర్మ పరిరక్షణ సమితి, సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కలువాయిలో నగర సంకీర్తన నిర్వహించారు. రామ కీర్తనలతో గ్రామవీధులు మార్మోగాయి.

ఆదురుపల్లిలో రక్తదాన శిబిరం

చేజర్ల, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆదురుపల్లి గ్రామంలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. స్థానిక యువత రక్తదానం చేశారు. ఈకార్యక్రమంలో స్థానిక ఉపాధ్యాయుడు మల్లికార్జున, రెడ్‌క్రాస్ మోటివేటర్ మధుసూదన్, తదితరులు పాల్గొన్నారు.

వెలుగొండ ప్రాజెక్టును యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలి

ఉదయగిరి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): వెలుగొండ ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం అదనపు నిధులు కేటాయించి యుద్ధప్రాతిపకదిన పూర్తిచేయాలని వెలుగొండ సాధన సమితి అధ్యక్షుడు మాదాల శ్యాంప్రసాద్, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర అధ్యక్షుడు నారాయణ కోరారు. ఆదివారం స్థానిక కోట్నీస్ ప్రజా వైద్యశాల ఆవరణలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రాజెక్టుల పూర్తికి పార్టీలకతీతంగా నాయకులు, రైతులు, యువకులు ఉద్యమించాలన్నారు. ఈకార్యక్రమంలో వెలుగొండ సాధన సమితి నాయకులు దస్తగిరి అహ్మద్, బసిరెడ్డి మాలకొండయ్య, మూలె వెంగయ్య, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

కలిగిరి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వేంకటేశ్వర స్వామి, సాయిబాబా ఆలయాల వద్ద త్రిపుల్ ఆర్ టిఫిన్ హోటల్ అధినేత రావూరి రమేష్‌రెడ్డి ఆదివారం చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. మొదటి రోజున పట్టణ వాసులకు పానకం, వడపప్పు పంచిపెట్టారు.

పారిశ్రామికవేత్త గంగాప్రసాద్ జన్మదిన వేడుకలు

కలువాయి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్ జన్మదిన వేడుకలు ఆదివారం స్థానిక వృద్ధుల ఆశ్రమంలో టీడీపీ నాయకులు నిర్వహించారు. కేక్ కట్ చేసి, వృద్ధులకు పండ్లు, కూరగాయలు అందజేశారు. అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు జీ వెంకటేశ్వర్లు నాయడు, అరిబోయిన సుందరయ్య యాదవ్, గడ్డం కిషోర్‌రెడ్డి, నాగిరెడ్డి రాజారెడ్డి, ఏ.మల్లికార్జునయ్య, తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీత జయప్రకాష్‌కు సత్కారం

కావలిటౌన్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): కావలి బుద్ధవిహార్ స్థాపకుడు పి జయప్రకాష్ అంబేద్కరిజంపై చేసిన సేవలను గుర్తించిన రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర మాల ఉద్యోగుల సంఘం వారు ఇటీవల ఒంగోలులో జరిగిన కార్యక్రమంలో అంబేద్కర్ సేవారత్న అవార్డు అందించారు. దీంతో ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్‌నగర్‌లోని బుద్ధవిహార్ వద్ద జయప్రకాష్ దంపతులను స్థానికులు ఘనంగా సత్కరించి అభినందించారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం



కావలి ట్రంకురోడ్డు శివాజీ సెంటర్‌లో బీజేపీ జెండా ఆవిష్కరించిన ఆపార్టీ నేతలు

కావలి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని మాగుంటపార్వతమ్మ ట్రంకురోడ్డులోని శివాజీ సెంటర్‌లో పార్టీ జెండాను ఆవిష్కరించారు. బీజేపీ కావలి ఒకటో పట్టణ అధ్యక్షుడు మంద కిరణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నేతలు అంచిపాకల కమల, కే.బ్రహ్మానందం, సీవీసీ సత్యం, అమరా వెంకటసుబ్బారావు, పరుసు వెంకటేశ్వర్లు, మద్దివెట్టి నరేంద్ర, పాతపాటి రమణారెడ్డి, వాయుగండ్ల సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు : బీజేపీ ఆవిర్భావ దినం సందర్భంగా పట్టణంలోని కోవూరు రోడ్డులో ఉన్న జ్యోతిరావు పూలే విగ్రహం సమీపంలో ఏర్పాటు చేసిన బీజేపీ జెండాను ఆపార్టీ నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ గట్టమనేని హరిబాబు, పార్టీ నాయకులు మన్నేపల్లి వరప్రసాదరావు, జొన్నాదుల రాఘవయ్య, చుండి మురళీధర్, పాణ్యం గాంధీ, అమలనాథుని మాల్యాద్రినాయుడు, బొర్రా కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

జలదంకి : జలదంకి బస్టాండ్ కూడలిలో ఆదివారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆ పార్టీ మండల అధ్యక్షుడు ముడి కిషోర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. పార్టీ జెండాను ఎగురవేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు వడ్డే శ్రీనాథ్‌రెడ్డి, బండారు తిరుపతిరెడ్డి, చల్లా హనుమారెడ్డి, వంటేరు రాకేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బిట్రగుంట : బోగోలులోని బీజేపీ కార్యాలయంలో ఆపార్టీ మండల అధ్యక్షుడు వీరాల శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భరత్‌కుమార్, మండల మాజీ అధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులు యాదవ్ ముఖ్యఅతిథులుగా హాజరై పార్టీ జెండా ఆవిష్కరించారు. శ్రీరామనవమి పురస్కరించుకుని మండల మహిళ అధ్యక్షురాలు నూకసాని రాజ్యలక్ష్మి వడపప్పు, పానకం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జీ.వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం, రాచూరికిశోర్, వెంకటరమణయ్య, అరుణ్‌కుమార్, బాలునాయుడు, గోవిందరాజులు, తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి : స్థానిక పంచాయతీ బస్టాండ్ ఆవరణలో ఆదివారం భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షురాలు విజయలక్ష్మీ పతాకాన్ని ఆవిష్కరించారు. అలాగే మోటపోతుల చెన్నయ్య ఆధ్వర్యంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మూలె బాలకృష్ణారెడ్డి, గడ్డం ప్రసాద్, నారాయణరెడ్డి, మాధవరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, ఆవుల రోశయ్య, చల్లా సుబ్బరత్నం, షాజహాన్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కలువాయి : బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక బస్టాండులో ఆ పార్టీ నేత దండు పెంచలయ్య ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పగడి పెంచల ప్రసాద్, శివాజీ, నరసింహ, జోసఫ్ తదితరులు పాల్గొన్నారు.



కందుకూరు : కోవూరు రోడ్డులో పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

అనంతసాగరం : బీజేపీ ఆవిర్భావ దినోత్సవం స్థానిక పార్టీ కార్యాలయం వద్ద ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు వల్లూరు రాజేష్‌రెడ్డి, కార్యదర్శి జగదీష్, వెంకటేష్, వెంకిరెడ్డి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

వింజమూరు: బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని పాత బస్టాండ్ సెంటర్‌లో ఆదివారం పార్టీ జెండాను మండల పార్టీ అధ్యక్షుడు డేగ మధుయాదవ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మంట రమేష్, నాయకులు దినేష్, దాసరి ప్రసాద్, గంగిశెట్టి హజరత్, రాజా, రమేష్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.



ఉదయగిరి : భరతమాత, పార్టీ వ్యవస్థాపకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



కలువాయిలో జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు.



జలదంకి బస్టాండ్ సెంటర్‌లో బీజేపీ జెండా ఎగురవేస్తున్న నాయకులు

అడ్డంకులు అధిగమిస్తేనే ప్రజారోగ్యం

- సంపాదన సొమ్ములో 30 శాతం వైద్యానికే...
- పేదలకందే చికిత్సలు అంతంత మాత్రమే
- పాలకుల హామీలు నెరవేరేదెప్పుడు..?
- నేడు ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

నెల్లూరు (వైద్యం) ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): పేద, మధ్య ప్రజలకు వైద్యాన్ని చేరువ చేసేందుకు ప్రభుత్వాలు పలు హామీలు ఇస్తూనే ఉన్నాయి. అయితే అవి క్షేత్ర స్థాయిలో అమలు కావటం లేదు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఇంకా పూర్తిస్థాయిలో వైద్య చికిత్సలు అందక పోగా, ఎన్టీఆర్ వైద్యసేవ పథకం ద్వారా ప్రైవేట్ ఆసుపత్రుల్లో అందే చికిత్సలు కూడా అంతంత మాత్రంగా ఉన్నాయి. దీంతో ఎన్నో కుటుంబాలు తమ సంపాదనలో 30 శాతం వైద్యానికే ఖర్చు చేయాల్సి వస్తున్నది. జిల్లా వ్యాప్తంగా 27 లక్షల మందికిపైగా జనాభా ఉన్నా, అందులో 25 శాతం మందికి మాత్రమే ప్రభుత్వ వైద్యం అందుతుంది. ఈ నేపథ్యంలో ఈనెల 7న (నేడు) ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించాలని తీర్మానించింది.

● హామీలు నెరవేరేనా...?

గతంలో వైసీపీ అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీల అమలుకు అనేక అడ్డంకులు ఏర్పడ్డాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో వైద్యసేవల్లో కొంత ప్రగతి కనిపిస్తుందేకానీ పూర్తిస్థాయిలో వైద్యం ప్రజలకు అందటం లేదు. సమీపంలోని పీహెచ్‌సీలకు, సీహెచ్‌సీలకు వెళ్లే పేద రోగులకు వైద్యులు అందుబాటులో ఉండడంలేదు. వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులకు చికిత్సలు సంపూర్ణంగా అందటం లేదు. నగరంలోని జీజీహెచ్‌లో 750 పడకలు ఉన్నాయి.ప్రతి రోజూ 550 మంది వరకు రోగులు ఇక్కడ చికిత్సలు పొందు తుంటారు. ఇక్కడ న్యూరాలజీ, యూరాలజీ వంటి సేవలు అందించేందుకు వైద్యుల నియామకం చేపట్టినా గుండెవైద్య నిపుణులను మాత్రం నేటికి నియమించలేదు. ఇక క్యాన్సర్ విభాగం ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రకటించి రెండేళ్లయినా నేటికి కార్యరూపం దాల్చలేదు.

అందని ఆరోగ్యశ్రీ సేవలు

జిల్లా వ్యాప్తంగా 71 ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులు ఉన్నాయి. వాటికి రూ. 150 కోట్లకుపైగా ప్రభుత్వం బకాయి ఉంది. దీంతో ఆరోగ్యశ్రీ కింద చికిత్సలు చేయలేమం టూ పలు ఆసుపత్రులు చేతులెత్తేస్తు న్నాయి. ఆరోగ్యశ్రీ కింద రూ. 25 లక్షల వరకు ఖర్చు చేసేలా ప్రభుత్వం ఇటీవల ప్రకటించినా, అది అమలు కావటం లేదు.



ప్రపంచ ఆరోగ్య దినోత్సవ లోగో

ప్రభుత్వ పరంగా అన్నీ వైద్యసేవలు



ప్రభుత్వ పరంగా అన్నీ వైద్య సేవలు అందిస్తున్నాం. అయితే గుండె వైద్య చికిత్సల అవసరం ఉంది. ప్రభుత్వం అందించే సహకారం తోనే ఆ సేవలు కూడా అందచే యనున్నాం. ప్రైవేట్ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రులకు దీటుగా జీజీహెచ్ లో వైద్య చికిత్సల్లో సంస్కరణలు తీసుకు రావాల్సిన అవసరం ఉంది.

- డాక్టర్ సిద్దానాయక్, జీజీహెచ్, సూపరింటెండెంట్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టిపెట్టాలి



వైద్య రంగంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టిపెట్టాలి. ప్రజారోగ్యం పట్ల ప్రభుత్వాలు మొక్కుబడి సేవలు అందిస్తు న్నాయి. వైద్యానికి జీడీపీలో ఏడు శాతం నిధులు కేటాయించాలని కేంద్రాన్ని కోరు తున్నా కేవలం 1.5 శాతం మాత్రమే నిధులు కేటాయిస్తుంది. ఈ నేపథ్యంలో ప్రజారోగ్యానికి తీవ్ర అవరోధాలు ఏర్పడుతున్నాయి. పీహెచ్‌సీల స్థాయి నుంచి అనేక సంస్కరణలు తీసుకురావాల్సి ఉంది.

- డాక్టర్ ఎంవీ రమణయ్య, ప్రజారోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు

సెంట్రల్ బ్యాంకు అధికారిపై దాడిని ఖండిస్తున్నాం

ఏఐబీఈఏ సంయుక్త కార్యదర్శి ఉదయ్‌కుమార్

నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా క్రెడిట్ ఆఫీసర్ జీ నరసింహులుపై శనివారం జరిగిన దాడి అనుమానుషమని, దీనిని ఖండిస్తున్నామని ఏఐబీ ఈఏ సంయుక్త కార్యదర్శి వీ ఉదయ్ కుమార్ తెలిపారు. ఆదివారం ఏఐబీఈఏ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయ న మాట్లాడారు. బ్యాంకు నుంచి రుణం తీసుకున్న మల్లికార్జున్‌గౌడ్ అనే వ్యక్తి మరో ఇద్దరితో కలిసి నరసింహులుపై దాడి చేశారని చెప్పారు. దీనిని తమ సంఘంతోపాటు ఏపీయూబీఈఏ, ఏపీటీబీఈ, ఎన్‌డీబీఈఎఫ్‌లు కూడా ఖండిస్తున్నాయని తెలిపారు. ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడానికే బ్యాంకు ఉద్యోగులు, అధికారులు ఉన్నారని, ఖాతాదారులు కూడా వారితో మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని కోరారు. దాడిపై పోలీసులకు ఫిర్యాదు చేశామని, నిందితుడిని తక్షణం అరెస్టు చేసి శిక్షించక పోతే దేశవ్యాప్త సమ్మె చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బాధితుడు నరసింహులు, ఏపీటీబీఈఎఫ్ ఉపాధ్యక్షుడు రమణ ప్రసాద్, ఏపీయూబీ ట్రెజరర్ పీ సుమన్, ఎన్సీబీఈసీసీ కార్యదర్శి మృదుల, రఘు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా బీజేపీ

ఆవిర్భావ దినోత్సవంలో సురేష్‌రెడ్డి



బీజేపీ జిల్లా కార్యాలయంలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, చిత్రంలో సురేష్‌రెడ్డి తదితరులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : భారతీయ జనతాపార్టీ కేవలం రెండు సీట్లతో ప్రారంభమై నేడు ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా ఎదిగిందని, ఇది కార్యకర్తల నిబద్ధతకు నిదర్శమని ఆ పార్టీ నాయకుడు, ఆర్డీసీ నెల్లూరు జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి అన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఆదివారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిగింది. నెల్లూరులోని పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు శీపారెడ్డి వంశీధర్‌రెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించి నాయకులు, కార్యకర్తలకు స్వీట్లు పంచిపెట్టారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కర్నాటి ఆంజనేయరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు వాకాటి నారాయణరెడ్డి, బీసీ జోనల్ ఇంచార్జ్ ముక్కు రాధాకృష్ణగౌడ్, జిల్లా కార్యదర్శి చిలకా ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు. కాగా, మూలాపేట ఇరగాళమ్మ ఆలయం వద్ద జరిగిన ఆవిర్భావ దినోత్సవంలో శిరీష, సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. కల్యాణి ఫిలిమ్స్ కార్యాలయం ఎదుట పార్టీ రాష్ట్ర కార్యదర్శి కందికట్ల రాజేశ్వరి ఆధ్వర్యంలో, తడికల బజారు సెంటర్‌లో ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బర్రి శ్రీనివాసులు ఆధ్వర్యంలో, చిన్నబజారు రాజేంద్రనగర్‌లో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్‌సింగ్ ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవం జరిగింది. రాజేంద్ర నగర్‌లో స్థానిక బెంగాలీ స్వర్ణకారులు 300 మంది పార్టీలో చేరారు. కార్యక్రమాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజారోహణం



సంగం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెన్నానది ఒడ్డున ఉన్న సంగమేశ్వరాలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం తెల్లవారుజామున ధ్వజారోహణ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధ్వజారోహణను పురస్కరించుకుని ప్రసాదంగా అందచేసే కొడిముద్ద కోసం భక్తులు ఎగబడ్డారు. ఆలయ ప్రధాన అర్చకులు గోపాలకృష్ణ మూర్తి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి అవ్వారి వెంకటేశ్వర్లు దంపతులు, బత్తూరు బాలయ్య వారసులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ధ్వజారోహణ నిర్వహిస్తున్న అర్చకులు

కెమికల్ లారీ బోల్తా : తప్పిన ప్రమాదం



బోల్తా పడిన కెమికల్ లారీ

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): వేగంగా వెళ్తున్న ఓ లారీ అదుపుతప్పి బోల్తాపడిన సంఘటన సానిక వెంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాల మేరకు.. విశాఖపట్నం నుంచి ఫార్మా కంపెనీలకు చెందిన వృథా కెమికల్ ఆయిల్‌ను కడపకు తీసుకెళ్తున్న లారీ జాతీయ రహదారిపై అదుప తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ సుకుమార్‌కు గాయాలు కావడంతో పాటు దట్టమైన పొగలు కమ్ముకున్నాయి. దీంతో స్థానికులతో సహా అటుగా వెళ్లే ప్రయాణికులు భయాందోళనలకు గురై పరుగులు తీశారు. అగ్నిమాపక సిబ్బంది హుటాహుటీన అక్కడికి చేరుకొని చర్యలు చేపట్టారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరుపై ఆరా తీశారు.

మంత్రి నాదెండ్ల జన్మదిన వేడుకలు

జలదంకి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేములపాడులో ఆదివారం జనసేన నేత, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ జన్మదినం వేడుకలను ఆ పార్టీ నాయకులు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలకు నియోజకవర్గ నాయకుడు నిమ్మలపల్లి రామ్‌చైతన్య చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పసుపులేటి వెంకటరావు, తొట్టెంపూడి రఘు పాల్గొన్నారు.

20 ఎకరాల మామిడి తోట దగ్ధం

వింజమూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : వింజమూరు శివారు ప్రాంతంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వలన 20 ఎకరాల మామిడితోట దగ్ధమైన సంఘటన ఆదివారం మధ్యాహ్నం జరిగింది. సుమారు రూ. 5లక్షల నష్టం వాటిల్లిందని రైతు రామదాసు తెలిపాడు. సకాలంలో అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారన్నారు.

రైలు ఢీకొని వృద్ధురాలి మృతి



గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహం

నెల్లూరు (క్రైం), ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని వేదాయపాలెం రైల్వే స్టేషన్ సమీపంలో ఆదివారం రైలు ఢీకొని గుర్తు తెలియని వృద్ధురాలు మృతిచెందింది. సమా చారం అందుకున్న రైల్వే ఎస్‌ఐ జీ మాల కొండయ్య మృతదేహాన్ని పరిశీలించి పోస్టు మార్టం కోసం జీజీహెచ్ మార్చురీకి తరలిం చారు. మృతదేహంపై బ్లూ కాలర్‌పై వైలెట్ రంగు పూతల చీర, వైలెట్ రంగు జాకెట్, బ్లూ కలర్ పావడ ఉన్నాయని, కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

కల్యాణం.. కమనీయం..

భద్రాద్రిలో వైభవంగా సీతారాముల పరిణయం



భక్తి పారవశ్యంలో సినీనటి కొణిదెల నిహారిక

దక్షిణ అయోధ్యగా భాసిల్లుతున్న భద్రాచలంలో సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. ఈ వేడుకకు సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించగా పలువురు ప్రముఖులు హాజరయ్యారు.



ముత్యాల తలంబ్రాలు తీసుకొస్తున్న దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ

కల్యాణ వేడుకలో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు, డిప్యూటీ సీఎం భట్టి దంపతులు

టీటీడీ తరపున పట్టువస్త్రాలు సమర్పిస్తున్న చైర్మన్ బీఆర్ నాయుడు



కల్యాణం అనంతరం తిరువీధి సేవకు బయలుదేరిన సీతారాములు



రామాలయంలో అర్చక బృందంతో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు

బీసీ కులగణన కోసం 11న ధర్నా

● బీసీ సమన్వయ కమిటీ

నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : బీసీ కులగణన జరపాలంటూ ఈనెల 11న నెల్లూరులోని పూలే విగ్రహం వద్ద ధర్నా చేస్తున్నట్లు బీసీ సమన్వయ కమిటీ నెల్లూరు జిల్లా చైర్మన్ బొమ్మి నాగకిషోర్ తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో ఆదివారం ఆయన మాట్లాడారు. ప్రధాన పార్టీలు బీసీలను ఓట్ బ్యాంక్‌గా వాడుకుంటున్నాయని, ప్రతీ ఎన్నికల్లోనూ సముచిత స్థానం కల్పించకుండా మోసం చేస్తున్నాయని ఆరోపించారు. ధర్నాకు అందరూ మద్దతు తెలపాలని బీసీ సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ బీసీ రమణ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో కన్వీనర్లు ఇరగబోయిన శ్రీనివాసులు, మస్తాన్‌గౌడ్, వెంకట రమణ ఆచారి, మహమ్మద్ రఫీ, సోమగోపాల్ పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యంపై కేసు

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : అప్పులు ఎందుకు చేశావని తండ్రి ప్రశ్నించడంతో మనస్థాపానికి గురైన కుమారుడు ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీనిపై వేదాయపాళెం పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరులోని బీవీనగర్‌కు చెందిన శ్రీనివాసులు కుమారుడు ఉదయ్‌కిరణ్ చెన్నైలో బీటెక్ పూర్తి చేసి ఈ నెల 2న ఇంటికి వచ్చాడు. ఉదయ్‌కిరణ్ అప్పులు చేసి వచ్చాడని అదేరోజు రాత్రి అతని స్నేహితులు శ్రీనివాసులుకు ఫోన్ చేసి చెప్పారు. అప్పులు ఎందుకు చేయాల్సి వచ్చిందని తండ్రి ప్రశ్నించడంతో మనస్థాపానికి గురైన ఉదయ్‌కిరణ్ ఈ నెల 3వ తేదీ ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఫోన్ స్విచ్ ఆఫ్ అని వస్తుండటంతో కుటుంబ సభ్యులు గాలించినా అతని జాడ తెలియక పోవడంతో తండ్రి ఆదివారం వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యంపై..

నెల్లూరు(క్రైం), (ఆంధ్రజ్యోతి): జిమ్‌కు వెళుతున్నానని ఇంటి నుంచి వెళ్లి యువతి అదృశ్యమైంది. ఈ ఘటనపై నగరంలోని సంతపేట పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు, పశ్చిమబంగాల్ రాష్ట్రంలోని హుబ్లీ జిల్లాకు చెందిన షేక్ మంటు కుటుంబం జీవనాధారం కోస రెండేళ్ల క్రితం నెల్లూరుకి వచ్చారు. నగరంలోని గిడ్డంగివీధిలోని అయ్యప్ప టవర్స్‌లో వారు నివాసం ఉంటున్నారు. మంటు కుమార్తె సానియా సుల్తానా ఇంటర్ చదివి ఇంటి వద్దే ఉంటున్నది. ప్రతి రోజు ఆమె జిమ్‌కు వెళ్లి వచ్చేది. శనివారం సాయంత్రం జిమ్‌కు వెళ్లిన యువతి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబసభ్యులు చుట్టుపక్కల గాలించినా ప్రయోజనం లేకపోవడంతో ఆదివారం సంతపేట పోలీసులకు తండ్రి మంటు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్ర టెన్నిస్ బాల్ క్రికెట్‌లో జిల్లాకు ద్వితీయ స్థానం



ద్వితీయ స్థానం సాధించిన బాలబాలికల జట్లు

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో శని, ఆదివారాల్లో జరిగిన 12వ రాష్ట్రస్థాయి అండర్-19 బాల, బాలికల టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీల్లో జిల్లా బాల, బాలికల జట్లు రెండూ ద్వితీయ స్థానాలను సాధించాయి. రెండు విభాగాల్లోనూ క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరచడంతో రన్నరప్స్‌గా నిలిచారు. బాలికల విభాగంలో టీ తులసి ఉత్తమ ఆల్‌రౌండర్‌గా ప్రత్యేక ప్రశంసలు అందుకుంది. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నిర్వాహక కార్యదర్శి అజయ్‌కుమార్, కోచ్‌లు కే ఆశీర్వాదం, మమత, మేనేజర్లు పాపారావు, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడులు



పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్న ఎస్‌ఐ కిషోర్‌బాబు

అల్లూరు, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇందుపూరులో ఆదివారం పేకాట స్థావరంపై పోలీసులు దాడులు చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వివరాల మేరకు.. అందిన సమాచారం మేరకు ఎస్‌ఐ కిషోర్‌బాబు తన సిబ్బందితో ఇందుపూరు గ్రామం శివారంలో దాడులు చేయగా ఐదుగురు పేకాట ఆడుతూ పట్టుబడ్డారు. వారి నుంచి రూ.3500, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ట్రాక్టర్ పైనుంచి పడి వ్యక్తి దుర్మరణం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ బాజిబాబు

కావలి రూరల్, (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్‌లో వెళ్తూ కుదుపులకు అదుపుతప్పి అదే ట్రాక్టర్ కింద పడి గుడిపల్లి వెంకటరమణయ్య (53) మృతి చెందిన ఘటన ఆదివారం కావలి మండలం గౌరవరం జాతీయ రహదారిపై జరిగింది. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. కావలి మండలం మాతినవారిపాలెంకు చెందిన ఇస్రాపు పుల్లయ్య తన ట్రాక్టర్‌లో ఎండుగడ్డి తెచ్చేందుకు గ్రామానికి చెందిన గుడిపల్లి వెంకటరమణయ్య, సందు శ్రీనివాసులు, మరో ఇద్దరితో కలిసి విడవలూరు మండలం రామతీర్థం వెళ్లారు. ట్రాక్టర్‌లో గడ్డి వేసుకుని తిరుగు ప్రయాణంలో డ్రైవర్ అతివేగం, అజాగ్రత్తతో నడుపుతూ ముందు వెళ్తున్న వాహనాన్ని అధి గమించే క్రమంలో డ్రైవర్ పక్కన మడ్గర్ రేకుపై కూర్చుని ఉన్న వెంకటరమణయ్య అదుపు తప్పి కింద పడ్డాడు. అతనిపై ట్రాక్టర్ టైరు ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడి కుమారుడు బ్రహ్మయ్య ఫిర్యాదుతో రూరల్ ఎస్‌ఐ బాజిబాబు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గాయపడిన యువకుడి మృతి

కావలి రూరల్, (ఆంధ్రజ్యోతి): ఏసీ బిగించేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు మిద్దిపై నుంచి కిందపడి గాయాలై నెల్లూరులో చికిత్స పొందుతున్న పులివెందుల సాయికిరణ్(22) ఆదివారం మృతి చెందాడు. రూరల్ పోలీసుల వివరాల మేరకు... జలదంకి మండలం బ్రాహ్మణక్రాక అగ్రహారంకు చెందిన సాయికిరణ్ బైక్ మెకానిక్‌గా పనిచేస్తూ అప్పుడప్పుడూ సమీర్, ధనశేఖర్‌లతో కలిసి ఏసీలు బిగించే పనులకు వెళ్తాంటాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి కావలి మండలం ముసునూరులో రెండు అంతస్తుల మిద్దెకు ఏసీ బిగిస్తూ ప్రమాదవ శాత్తు సాయికిరణ్ కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం పట్టణంలోని ఓ ప్రయివేటు వైద్యశాలకు తరలించి ప్రథమచికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు ఎస్‌ఐ తిరుమలరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	113
స్కిన్ చికెన్	202
స్కిన్‌లెస్	226

కోడిగుడ్ల ధర (100) : 440

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.8559
వెండి కిలో ధర	రూ.90,800
వెండి ఒక గ్రాము	రూ.93.80

వైభవంగా సాయినాథుడి గంధ మహోత్సవం

నెల్లూరు (సాంస్కృతికం,ఆంధ్రజ్యోతి) : నగరంలోని బాలాజీనగర్ పద్మావతినగర్ సాయి దర్బార్ (అద్దాల మందిరం) ఆధ్వర్యంలో సాయిబాబా గంధ మహోత్సవం ఆదివారం రాత్రి వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా రథోత్సవం నిర్వహించారు. మేళతాళాలు, పండరి భజనలు, బాణాసంచా వేడుకలతో కళాకారులు సందడి చేశారు. అనంతరం సీతారామ కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. మధుసాయి, సాయి దర్బార్ కమిటీ సలహాదారు పీ రామసుబ్బయ్య పర్యవేక్షించారు. కాగా, గాంధీబొమ్మ సెంటర్ సాయిబాబా మందిరంలో శ్రీరామనవమి, షిరిడీ సాయిబాబా జయంతి ఉత్సవాలు జరిగాయి.

న్యూస్ బాక్స్

పోక్సో కేసు నమోదు

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై దర్గామిట్ట పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు... బీవీ నగర్‌కు చెందిన ఓ బాలిక దర్గామిట్టలోని ఓ విద్యాసంస్థలో ఎంసెట్ కోచింగ్ తీసుకుంటోంది. ఈనెల 4న ఆమె కోచింగ్ సెంటర్ లోపలికి వెళుతుండగా మెట్ల మార్గంలో అదే బిల్డింగ్‌లోని ఓ ఇన్సూరెన్స్ కార్యాలయ ఉద్యోగి శ్రీనివాసులురెడ్డి మాటలు కలిపాడు. తాను ఉన్నత చదువు చదివానని, కెమిస్ట్రీలో ఏవైనా సందేహాలు ఉంటే తీరుస్తానని చెప్పాడు. ఆమె అతడి మాటలు వినకుండా వెళుతుండగా ఆమెతో అసభ్యంగా ప్రవర్తించాడు. ఆమె ప్రతిఘటించి అక్కడి నుంచి వెళ్లిపోయింది. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేయగా వారు దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బాలికలకు పాదరక్షల పంపిణీ

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : స్మైల్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని బాలసదన్‌లో ఆశ్రయం పొందుతున్న అనాథ బాలికలకు పాదరక్షలను అందచేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు మదార్ మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో పాదరక్షలు అందించామని చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి అజ్మీర్ బాషా, కోశాధికారి నారాయణ, గౌరవాధ్యక్షుడు జీ రాజగోపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షులు సుబ్రహ్మణ్యం, మాధవ్, ఖయ్యుద్దీన్ పాల్గొన్నారు.

నేత్రదానం

నెల్లూరు (వైద్యం, ఆంధ్రజ్యోతి) : నగరంలోని దర్గామిట్ట సరస్వతి నగర్‌కు చెందిన పొన్నాల వెంకట రామిరెడ్డి (80) ఆదివారం మరణించడంతో ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి టెక్నీషియన్ సునీల్ ఈ నేత్రాలను సేకరించారు.

విద్యా చైతన్య యాత్రల పోస్టర్ ఆవిష్కరణ

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : గిరిజన విద్యాచైతన్య యాత్రల పోస్టర్‌ను నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆదివారం నగరంలోని వారి నివాసంలో ఆవిష్కరించారు. యానాదులను విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు ఈ కార్యక్రమానికి రూపకల్పన చేశామని గిరిజన విద్యా చైతన్య వేదిక నాయకులు పులి చెంచయ్య, యాకసిరి వెంకటేశ్వర్లు, పొట్లూరి శ్రీనివాసులు, దాసరి పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

విడవలూరు, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి చొరవతో ధాన్యానికి గిట్టుబాటు ధర లభించడంతో నెల్లూరులో ఆదివారం రాత్రి ఈస్ట్రన్ చానల్ డీసీ చైర్మన్ పాశం శ్రీహరిరెడ్డి ఆధ్వర్యంలో రైతులు సన్మానించారు. కార్యక్రమంలో వంశీకృష్ణారెడ్డి, పురందర్‌రెడ్డి, రవిచంద్ర, సత్యవోలు సత్యంరెడ్డి, చిన్నిబాబు, కుడుముల మల్లికార్జున, కొండా రఘు పాల్గొన్నారు.

ఘనంగా వార్షికోత్సవం

వెంకటాచలం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): చవటపాళెం పంచాయతీ ఎర్రగుంట గిరిజన కాలనీలో ఆదివారం సింహపురి వైద్య సేవాసమితి సభ్యులు నెల్లూరు జయభారత్ హాస్పిటల్ ఆధ్వర్యంలో బాలసంస్కార కేంద్ర వార్షికోత్సం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆర్‌ఎస్‌ఎస్ ప్రాంత సంఘ్ చాలక్ (రాష్ట్ర అధ్యక్షుడు), సింహపురి వైద్యసేవాసమితి ప్రధానకార్యదర్శి నాగిరెడ్డి హరికుమార్ రెడ్డిలు పాల్గొన్నారు. కార్యక్రమంలో గిరిజన నేతలు పొట్లూరు శ్రీనివాసులు, విజయలక్ష్మి, ఆర్‌ఎస్‌ఎస్ రాష్ట్ర నేత నరసయ్య, హాస్పిటల్ జనరల్ మేనేజర్ గురుప్రసాద్, ప్రాజెక్టు ఆఫీసర్ సుబ్బారావు ఉన్నారు.

'పగడాల' మృతిపై నిరసన

కొడవలూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): నార్తురాజుపాలెంలో క్రైస్తవ ఐక్యవేదిక సభ్యులు ఆదివారం పాస్టర్ పగడాల ప్రవీణ్ కుమార్ మృతిపై నిరసన తెలిపారు. ప్రవీణ్ కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో పాస్టర్ సాల్మన్‌రాజు, జాకబ్, సుధీర్, స్థానిక సంఘం డాక్టర్ సి.జొనతాన్ పాల్గొన్నారు.

కోదండరాముడికి శేషవాహనసేవ

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): పెద్దూరు కోదండరామస్వామి ఆదివారం రాత్రి శేషవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త దొడ్ల మురళీకృష్ణారెడ్డి పర్యవేక్షణలో వేడుకలు జరిగాయి. సోమవారం సూర్య ప్రభవాహన, హంసవాహన సేవలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

ఘనంగా 'బొద్దులూరి' జన్మదినం

పొదలకూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): పట్టణ టీడీపీ అధ్యక్షుడు బొద్దులూరి మల్లికార్జుననాయుడు జన్మదినం ఆదివారం స్థానిక బోగోలు కల్యాణ మండపంలో జరిగింది. కార్యక్రమంలో తలచీరు మస్తాన్‌బాబు, బక్కయ్యనాయుడు, వెంకటరత్నం నాయుడు, కోడూరు పెంచల భాస్కర్‌రెడ్డి, బోగోలు భాస్కర్‌రెడ్డి, అమర్తలూరి చెంచయ్య, ఆలుపూరు శ్రీనివాసులు పాల్గొన్నారు.



సీతారాముల కల్యాణోత్సవంలో ధర్మవరం సుబ్బారావు



శ్రీనివాస అగ్రహారంలో జరిగిన సీతారామ కల్యాణోత్సవంలో నిర్వాహకులు

కల్యాణం... కమనీయం

- వైభవంగా సీతారాముల కల్యాణం
- పందిళ్లలో భక్తుల సందడి

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : శ్రీరామ నవమి సందర్భంగా నగరంలోని శబరి శ్రీరామక్షేత్రం అధ్వర్యంలో శ్రీరామకోటి స్థూపం ఆవరణంలో ఆదివారం సీతారాముల కల్యాణం వైభవంగా జరిగిం ది. ముందుగా కల్యాణ మూర్తులను మంగళవాయిద్యాలు, వేద మంత్రాలు, పెండ్లి సామాగ్రితో ఊరేగింపుగా వేదిక వద్దకు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా రామ నామ స్మరణతో పరిసరాలు మారుమోగాయి. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, సుజిత దంపతులు ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలు సమర్పించారు. శబరి శ్రీరామక్షేత్రం అర్చకుడు నరేష్ స్వామి ఆధ్వర్యంలో వేదపండితులు జానకి రమణులు పరిణయోత్సవాన్ని శాస్త్రోక్తంగా, వ్యాఖ్యాన సహితంగా జరిపారు. భక్తులకు తాగునీరు, బెల్లం పానకం, మజ్జిగ, పులిహోర, వడపప్పు ప్రసాదాలు పెద్ద ఎత్తున పంపిణీ జరిగింది. టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి దంపతులు, మాజీ మేయర్ భానుశ్రీ, మాజీ కార్పొరేటర్ పిండి సురేష్, బీజేపీ, జనసేన నాయకులు తరలివచ్చారు. కల్యాణోత్సవం అనంతరం అన్న సంతర్పణ జరిగింది. శబరి శ్రీరామక్షేత్రం చైర్మన్ చెన్నూరు వెంకటేశ్వరరెడ్డి, కమిటీ సభ్యులు అన్నం దయాకర్‌రెడ్డిగౌడ్, చంద్రారెడ్డి, దద్దోలు రమణయ్య, తదిత రులు పర్యవేక్షించారు.

● శ్రీనివాస అగ్రహారంలో

నగరంలోని శ్రీనివాస అగ్రహారంలో విజయమహల్ గేట్ వ్యాపార మిత్రమండలి ఆధ్వర్యంలో సీతారామల కల్యాణం కనుల పండువగా జరిగింది. భారీ సంఖ్యలో భక్తులు, వ్యాపారులు కుటుంబాలు తరలివచ్చారు. ది నెల్లూరు డిస్ట్రిక్ట్ హోల్‌సేల్ కెమిస్ట్స్, డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డీ అశోక్‌కుమార్, రవికుమార్, అయితా భాస్కర్, కమలాకర్‌రావు, రామమోహన్‌రావు తదితరులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

● మాగుంట లే అవుట్ వెంకటేశ్వరస్వామి ఆలయంలో కల్యాణం వైభవంగా జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

● రంగనాథస్వామి ఆలయంలో ఉదయం శ్రీదేవి భూదేవి సమేత రంగనాథస్వామికి, సీతాలక్ష్మణ హనుమసహిత శ్రీరామచంద్ర మూర్తుకి తిరుమంజనం సేవలు జరిగాయి.



హనుమ వాహనంపై రంగనాథుడు

అనంతరం శ్రీరామ అవతార ఘట్టం పురాణ పఠనం, సీతారాముల కల్యాణాలు నిర్వహించారు. సాయంత్రం పూలంగి సేవ, రాత్రికి హనుమంత వాహనంపై పేట ఉత్సవం జరగను న్నాయి. భక్తులు ఆలయ చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ధర్మకర్తలు, ఈవో ఆళ్ల శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

● బాలాజీనగర్ సీతారామ మందిరంలో 44వ వార్షిక బ్రహ్మోత్సవాలకు శ్రీరామనవమి సందర్భంగా అంకురార్పణ పూజలు జరిగాయి. ఉత్సవ కమిటీ చైర్మన్ అమరా మోహన్‌రావు, ఆలయ చైర్మన్ తన్నీరు మస్తాన్ రావు, కార్యదర్శి సోమిశెట్టి వెంకట రత్నం, కోశాధికారి కొప్పవరపు శివప్రసాద్, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

● ఉస్మాన్‌సాహెబ్ పేటలోని రామమందిరంలో శ్రీరామ నవమి పూజలు జరిగాయి. సాయంత్రం వార్షిక బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరి గింది. ఈవో దుర్గయ్య పర్యవేక్షించారు.

● పప్పులవీధి మహాలక్ష్మీ ఆలయంలో వసంత నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా సీతారా ముల కల్యాణం వైభవంగా జరిగింది. ఈవో హేమచంద్ర రావు పర్యవేక్షించారు.

● వేదాయపాలెం త్యాగరాజస్వామి మందిరంలో సీతారాముల కల్యాణం కన్నుల పండువగా జరిగింది. ఉదయం ఉత్సవమూర్తులకు తిరు మంజనం, సాయం త్రం ఊంజల్‌సేవ, సాంస్కృ తిక ప్రదర్శనలు అలరించా యి. అనంతరం గజవాహన సేవ, ప్రాకా రోత్సవం జరిగాయి.

స్టేడియంలో వేడుకలు

నెల్లూరు(విద్య,ఆంధ్రజ్యోతి) : ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో ఆదివారం వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యం లో శ్రీరామనవమి వేడుకలు నిర్వహించారు. అధ్యక్షుడు చింతల అమరేంద్రరెడ్డి, కార్యదర్శి పొన్నం రవిచంద్ర, కోశాధికారి జీకే గోపీనాథ్ గౌరవాధ్యక్షుడు మేకల నరేంద్రరెడ్డి పాల్గొన్నారు.

● ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కూడా శ్రీరామనవమి వేడుకలు నిర్వహించారు. వాకర్స్‌కు తీర్థప్రసాదాలు, విసన కర్రలను అందచేశారు. వాకర్స్ ఎలక్ట్ గవర్నర్ నలుబోలు బలరామయ్యనాయుడు, అసోసియేషన్ అధ్యక్షుడు కిలారి శ్రీనివాసులు నాయుడు, కార్యదర్శి జీ నారాయణరెడ్డి, కోశాధికారి మాగంటి ప్రసాద్, నేతలు పాల్గొన్నారు.

● నెల్లూరు (వైద్యం,ఆంధ్రజ్యోతి) : నగరంలోని 53వ డివిజన్ గాంధీ గిరిజన కాలనీలో శ్రీరామ కల్యాణ మహోత్సం జరిగింది. అనంతరం భారీ అన్నదానం జరిగింది. ఉభయకర్తలుగా భాగి సుబ్బయ్య, సుబ్బమ్మ, వెంకట రమణయ్య, ప్రియాంక దంపతులు వ్యవహరించారు. అనంతరం నిర్వహిం చిన అన్నదానంలో రాష్ట్ర సివిల్ సప్లై డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భరత్‌కుమార్ యాదవ్, నాయకులు మండవ రామయ్య, బీజేపీ ఎస్టీసెల్ అధ్యక్షుడు ప్రసాద్, నూకలపాటి తిరు పతయ్య, కర్రెద్దుల కృష్ణ, వెంకయ్య, వెంకటరవి తదితరులు పాల్గొన్నారు.

● 46, 47 డివిజన్లలో...

నెల్లూరు (హరనాథపురం, ఆంధ్రజ్యోతి) : నగరం లోని 46, 47 డివిజన్లలో సీతారామ కల్యాణో త్సవాలు ఘనంగా జరిగా యి. టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు, మువ్వల రాంబాబు ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

కనుల పండువగా శ్రీరామనవమి

- సీతారాముల కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి
- వేడుకలకు తరలివచ్చిన భక్తులు

కొడవలూరు, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి):శ్రీరామనవమిని పురస్కరించుకుని నార్తురాజు పాలెం రామాలయంలో సీతారాముల కల్యాణం ఆదివారం కనులపండువగా జరిగింది. వేడుకలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం జరిగిన అన్నదానంలో పాల్గొని స్వయంగా భక్తులకు వడ్డించి మాట్లాడారు. సీతారాముల ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని కోరారు. ఎంతటి విషయ పరిస్థితుల్లో సత్యం, ధర్మానికి కట్టుబడి ఉండాలన్న శ్రీరాముని జీవితమే మనకు ఆదర్శమన్నారు. సీతారాముల ఆదర్శజీవితం భారతీయ కుటుంబ ఔనత్యాన్ని చాటుతుందని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల పరిశీలకుడు ముంగమూరు శ్రీహరిరెడ్డి, నాయకులు మందిపాటి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఇరువూరు శ్రీధర్‌రెడ్డి, కేతు వెంకటరమణారెడ్డి, గరికపాటి రాజేంద్ర, పాటూరు రమేష్, నాసిన ప్రసాద్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం దొరద్ల సత్యనా రాయణ అన్నదానం చేశారు.

● పొదలకూరు, (ఆంధ్రజ్యోతి):స్థానిక పంచాయతీ బస్టాండ్‌లో మండల విశ్వహిందూ పరిషత్, సేవాభారతిసభ్యులు ప్రయాణికులు, స్థానికులకు వడపప్పు, పానకం పంపిణీ చేశారు. అలాగే సాయి మందిరంలో జరిగిన వేడుకలోస్వామివారికి కాకడ హారతి, పతాకావిష్కరణ, పంచామృత అభిషేకాలు చేశారు. అనంతరం నిర్వహించిన పతాక గ్రామోత్సవం సాయిబాబా మందిరం నుంచి మంగళవాయిద్యాల మధ్య సంగంరోడ్డు, కూడలి వరకు చేరుకుని, తిరిగి సాయిమందిరానికి చేరుకుంది. అలాగే సీతారాముల కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా పొదలకూరు అన్నం జ్యోతిసుబ్బారావు ఆలపించిన అన్నమయ్య కీర్తనలు అలరించాయి. అలాగే విష్ణుసహస్రనామ స్తోత్రాలు,గంధోత్సవం నిర్వహించారు. అర్చకులు శివస్వామి, సాయి మందిర ప్రధానార్చకులు శ్రీనివాసరావుస్వామి, రూప్ నారాయణ స్వామిల ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. షిరిడీ సాయి సేవాసమితి సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్.రాజగోపాల్, నాగిశెట్టి దామోదర్‌రావు, ఉపకార్యదర్శి తరుగు ప్రభాకర్, కోశాధికారి సుబ్బానాయుడు, సభ్యులు లక్కాకుల ఆనందరావు, కోటేశ్వరరావు, కదిరి పెంచలప్రసాద్, చాగిలేటి శ్రీహరి పర్యవేక్షించారు. వేడుకల్లో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పాల్గొన్నారు. పట్టణంలోని శ్రీలక్ష్మీగోదా సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో సీతారాముల కళ్యాణం నిర్వహించారు. ఉభయకర్తలు కర్రియావుల సురేష్, మంజుల దంపతులు స్వామివార్లకు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు.అనంతరం అన్నప్రసాద వితరణ జరి గింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రమణయ్య నాయుడు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

● బుచ్చిరెడ్డిపాళెం, (ఆంధ్రజ్యోతి):పంచేడు, శ్రీరంగరాజపురం, రేబాల,దామరమడుగు, రెడ్డిపాళెం,పెనుబల్లి, సాల్మానుపురం, జొన్నవాడ పల్లాప్రోలు, ఇస్కపాళెంలోని రామమందిరాలు,ఆంజనేయస్వామిఆలయాల్లో సీతారాముల కళ్యాణం కన్నులపండువగా జరి గింది. కొన్నిచోట్ల ప్రత్యేకపూజలు, అన్నదానాలు, వడ పప్పు, పానకాలు పంపిణీ చేశారు. వేడుకల్లో జడ్పీటీసీ సూరా ప్రదీప, శ్రీనివాసులురెడ్డి దంపతులు, సల్మానుపురంలో మల్లు జయరామిరెడ్డి, లక్ష్మినరసారెడ్డి, సుబ్బరామిరెడ్డి, పాటూరు గంగిరెడ్డి, సన్నపురెడ్డి సురేంద్రరెడ్డి, శ్రీరంగరాజపురంలో బాబుల్‌రెడ్డి ఉభయదాతగా వ్యవహరించారు.

● కోవూరు (ఆంధ్రజ్యోతి):పడుగుపాడు ధాత్రి హోమ్స్ ఆంజనేయస్వామి ఆలయంలో నిర్వహించిన సీతారాముల కల్యాణంలో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో పెన్నాడెల్టా చైర్మన్ జెట్టి రాజగోపాలరెడ్డి, బెజవాడ వంశీకృష్ణా రెడ్డి, అడపాలశ్రీధర్‌రెడ్డి, గాదిరాజు అశోక్, శ్రీనివాసులు పాల్గొన్నారు. జమ్మిపాళెం కోదండరామస్వామి ఆలయంలో పూజలు చేసికోవూరు పురాతన కోదండ రామస్వామికి అర్చకుడు శ్రీకాంతాచార్యులు సీతారాముల కల్యాణం నిర్వ హించారు.

●తోటపల్లిగూడూరు (ఆంధ్రజ్యోతి): వరిగొండ రామాలయంలో ధర్మకర్త గండవరం శ్యామలమ్మ ఆధ్వర్యంలో నవమి వేడుకలు జరిగాయి. మాజీ సర్పంచ్ మో పూరు రాధాకృష్ణారెడ్డి కుటుంబసభ్యులు సీతారామ కల్యాణం నిర్వహించారు. ఉత్సవంలో చుటు పక్కల గ్రామాల ప్రజలు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. స్థానిక నేతలు చింతంరెడ్డి దశరథరామిరెడ్డి, కొండ చంద్రశేఖర్‌రెడ్డి, రాజగోపాల్, సునీల్‌రెడ్డి పాల్గొన్నారు.

● రాపూరు, (ఆంధ్రజ్యోతి): పెంచలకోనలో శ్రీ రాముని కల్యాణం నేత్రపర్వంగా జరిగింది. శ్రీరాముని నామస్మరణతో పెంచలకోన మార్మోగింది. సాయంత్రం హనుమంత సేవ ఆస్థానం వైభవంగా నిర్వహించినట్లు ఆల య ఈవో పోరెడ్డి శ్రీనివాసులు రెడ్డి తెలిపారు.



కొడవలూరు: పాల్గొన్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి



పొదలకూరు: పతాకాలతో భక్తులు



పొదలకూరు: వడపప్పు, పానకం పంపిణీ చేస్తున్న విశ్వహిందూ పరిషత్ నాయకులు



తోటపల్లిగూడూరులో..

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

ఇందుకూరుపేట, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి):మండలంలోని కొమరిక, కొరుటూరులో భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలో పార్టీ మండలాధ్యక్షుడు కైలాసం శ్రీనివాసులురెడ్డి జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వెంపులూరు భాస్కర్‌గౌడ్, సీహెచ్.గాంధీ, రామలింగేశ్వరయ్య, మొగలయ్య, సీహెచ్.వెంకట్రావు పాల్గొన్నారు.

● కోవూరు, (ఆంధ్రజ్యోతి):స్థానిక తాలూకాఫీసు కూడలిలో జరిగిన వేడుకలో పార్టీ మండలాధ్యక్షుడు పోలిశెట్టి సుబ్బారావు,కాసా శ్రీనివాసులు, గాదిరాజు చక్రవర్తి, మొలకల శ్రీనివా సు లురెడ్డి, పొన్నగంటి వంశీకృష్ణ, రమణారెడ్డి, నరహరి మురళి పాల్గొన్నారు.

● వెంకటాచలం,(ఆంధ్రజ్యోతి):నిడిగుంటపాళెంలో జరిగిన వేడుకలో పార్టీ మండలాధ్యక్షుడు అనసాపురం శ్రీనివాసులు,జిల్లా నేత కుంచి శ్రీనివాసులు యాదవ్, నియోజకవర్గ సమన్వయకర్త కాకుటూరు రవీంద్రరెడ్డి, యువమోర్చ మండలాధ్యక్షుడు గొత్తల నరేష్, రాధారెడ్డి, దయాకర్, భానుప్రకాష్, కిష్టయ్య, గిరి ఉన్నారు.

● పొదలకూరు, (ఆంధ్రజ్యోతి):స్థానిక బస్టాండ్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో పార్టీమాజీ మండలాధ్యక్షుడు సంగన పెంచలరెడ్డి, మండలఉపాధ్యక్షుడు రాచపూటి ధనుంజయరావు, సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్లు, వేణుగోపాల్‌నాయుడు, శ్రీహరి, సురేంద్ర, ఆనంద్, కాశీనాయన స్వామి, హజరత్‌రెడ్డి, మధు పాల్గొన్నారు.

బుచ్చిరెడ్డిపాళెం, (ఆంధ్రజ్యోతి): పట్టణపరిధిలోని కోనేటిమిట్ట ప్రాంతంలో రామిశెట్టి కళ్యాణ్, రూరల్ అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, పెనుబల్లిలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు సీహెచ్.వినయ్ నారాయణ ఆధ్వర్యంలో వేర్వేరుగా జరిగిన వేడుకలో రామిశెట్టి మోహన్‌బాబు, కాసా శ్రీనివాసులు, నాగవేని, మస్తానయ్య, యల్లాల శివప్రసాద్ రెడ్డి, బొర్రు అంకయ్య, కన్వీనర్ శ్రీనివాస యాదవ్, శివకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

● రాపూరు, (ఆంధ్రజ్యోతి):పార్టీ శ్రేణులు జెండాను ఆవిష్కరించి స్వీట్లు పంచుకున్నారు. పంగిలి వేడుకలో పెంచలయ్య, సామర్ల జయసింహ, శివప్రసాద్ రెడ్డి, శ్రీనివాసులు, వెంకటాద్రి, పవన్ పాల్గొన్నారు.



ఇందుకూరుపేటలో పాల్గొన్న నాయకులు

పల్లెల్లో ఘనంగా రాములోరి పండుగ

నెల్లూరు రూరల్, ఏప్రిల్ 6, (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ మండలం గొల్లకందుకూరులోని రామమందిరంలో కల్యాణోత్సం జరిగింది. సౌత్‌మోపూరులో గ్రామోత్సవం అనంతరం కల్యాణోత్సవం, వసంతోత్సవం జరిపారు. వేదగిరి క్షేత్రం, అల్లీపురం, ఆమంచర్ల, ధనలక్ష్మీపురం, వావిలేటిపాడు ఆలయాల్లో సీతారాముల కల్యాణం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. నగరంలోని రామమూర్తినగర్ సత్యసాయి మందిరంలో ఉదయం నగర సంకీర్తన జరిగింది. అనంతరం సీతారామ కల్యాణోత్సవం, అన్నప్రసాద వితరణ జరిగాయి.

ప్రగతి చారిటీస్‌కు వీపీఆర్ రూ.3లక్షల విరాళం



విరాళం చెక్కు అందజేస్తున్న వీపీఆర్

నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ప్రగతి చారిటీస్ సంస్థకు నెల్లూరు పార్లమెంటు సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు రూ..3లక్షల విరాళాన్ని అందజేశారు. ఆదివారం చారిటీస్ ప్రతినిధులు పలువురు చిన్నారులతో కలిసి నెల్లూరులోని వీపీఆర్ నివాసంలో ఈ చెక్కును అందుకున్నారు. 2012 నుంచి వీపీఆర్ ఏటా రూ.3లక్షలు విరాళం ఇస్తున్నారని చెప్పారు. దాతలకు చిన్నారులు గులాబీ పువ్వులిచ్చి కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్‌పీఎల్ టీ-20 క్రికెట్ ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఇంతియాజ్

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్, నెల్లూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ సహకారంతో సింహపురి ప్రీమియర్ లీగ్(ఎస్‌పీఎల్) టీ-20 క్రికెట్ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. బుజబుజ నెల్లూరులోని సీఐఏ క్రీడా మైదానంలో మొదలైన ఈ పోటీల్లో మొత్తం ఎనిమిది జట్లు తలపడుతున్నాయి. ప్రారంభోత్సవ కార్యక్రమంలో అతిథిగా హాజరైన ఏసీఏ మౌలిక సదుపాయాల చైర్మన్ పీ విజయకుమార్ మాట్లాడుతూ ఔత్సాహిక యువ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు, వారి లోని క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ఈ టోర్నీ ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. అనంతరం జరిగిన తొలి మ్యాచ్‌లో గూడూరు రాయల్ చాలంజర్స్ జట్టు, ఆత్మకూరు రేంజర్స్ జట్టు తలపడ్డాయి. తొలుత బ్యాటింగ్ చేసిన గూడూరు జట్టు 19.2 ఓవర్లలో 139 పరుగులు ఆలౌట్ అయ్యింది. ఆ తర్వాత ఆత్మకూరు జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 112 పరుగులు మాత్రమే చేసి ఓటమి పాలైంది. 54 పరుగులు చేసిన కే మహేష్‌కుమార్ మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా ఎంపికయ్యాడు. ఈ కార్య క్రమంలో మదీనా వాచ్ కంపెనీ అధినేత ఇంతియాజ్, ఎన్‌డీసీఏ సంయుక్త కార్యదర్శి కే మునిగిరీష, కోశాధికారి ఎస్‌కే అబూబకర్, కేర్‌టేకర్ డీ శ్రీనివాసరెడ్డి, ఏసీఏ సభ్యుడు పీ భానుప్రకాష్‌రెడ్డి, టోర్నీ నిర్వాహక కమిటీ చైర్మన్ కే వంశీకుమార్, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు ఆర్యవైశ్యుల సొంతం

- సిటీ డీఎస్పీ సింధుప్రియ

నెల్లూరు (సాంస్కృతికం,ఆంధ్రజ్యోతి) : సేవా కార్యక్రమాలు చేయడానికి ఆర్యవైశ్యులు, ఆర్యవైశ్య సంస్థలు ముందుంటాయని నగర డీఎస్పీ సింధుప్రియ కొనియాడారు. ఆదివారం స్టోన్‌హౌస్‌పేటలో రైస్ కాన్వాసింగ్ ఏజెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పేగు షణ్ముఖరావు ఆధ్వర్యంలో నిర్వహించే 100 రోజుల మజ్జిగ చలివేంద్రాన్ని డీఎస్పీ, రెండో పట్టణ సీఐ ఎస్‌కే అన్వర్‌బాషా ప్రారంభించారు. ఈ మజ్జిగ చలివేంద్రాన్ని దాతల సహకారంతో గత ఆరేళ్లుగా నిర్వహిసున్నామని నిర్వాహకుడు పేగు షణ్ముఖరావు తెలిపారు. కార్యక్రమంలో గుర్రం సుధాకర్, పీవీ శేషారావు, ఎంపీ ఆంజనేయులు, భవనాపి సురేష్‌బాబు, దాసా లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీజేఐకి సాదర వీడ్కోలు



విమానాశ్రయంలో సీజేఐకి కలంకారి ఆర్ట్ అందజేస్తున్న కలెక్టర్

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్‌ఖన్నాకు విమానాశ్రయంలో సాదర వీడ్కోలు లభించింది. శ్రీవారి దర్శనార్థం శనివారం తిరుమలకు వచ్చిన ఆయన.. ఆదివారం మధ్యాహ్నం తిరుగు ప్రయాణమయ్యారు. విమానాశ్రయం వద్ద ఏపీ హైకోర్టు విజిలెన్స్ రిజిస్ట్రార్ శ్రీనివాస శివరాం, జిల్లా ఉమ్మడి డిస్ట్రిక్ట్ ప్రిన్సిపల్ జడ్జి ఇ.భీమారావు, తిరుపతి మూడవ అదనపు జడ్జి గురునాథ్, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, జేసీ శుభం బన్సాల్, జ్యుడిషియల్ ప్రొటోకాల్ సూపరింటెండెంట్ ధనుంజయనాయుడు సాదర వీడ్కోలు పలికారు. అనంతరం ఆయన ఢిల్లీ బయలుదేరి వెళ్లారు.

- రేణిగుంట, ఆంధ్రజ్యోతి

● నామమాత్రంగా టీడీఆర్ బాండ్ల పరిశీలన

టీడీఆర్ బాండ్ల జారీ స్పెషల్ డ్రైవ్ ఆదివారం కార్పొరేషన్ కార్యాలయంలో జరగలేదు. మాస్టర్ ప్లాన్ రోడ్ల పరిధిలోని కొన్ని సచివాలయాల్లో మాత్రమే నిర్వహించారు. అదీ ప్లానింగ్ సెక్రటరీల ద్వారా బాధితులనుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఆదివారం సెలవైనా టీడీఆర్ బాండ్ల స్పెషల్ డ్రైవ్‌ను పెద్దఎత్తున నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని ప్లానింగ్ అధికారులు చెప్పారు. దరఖాస్తుల పరిశీలన కోసం ఒక బృందం కార్యాలయంలో ఉంటే, మరో బృందం క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లేలా చర్యలు చేపట్టామన్నారు. ఈ సమాచారం తెలుసుకున్న పలువురు ఉదయం 10.30 గంటలకు కార్పొరేషన్ కార్యాలయానికి చేరుకున్నారు. గంటపాటు వేచిచూశారు. ఇంతలో టౌన్‌ప్లానింగ్ కార్యదర్శులు అక్కడికి చేరుకుని వారిని ఆయా పరిధిలోని సచివాలయాలకు తీసుకెళ్లి డాక్యుమెంట్ల పరిశీలన చేశారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

సచివాలయాల్లోనే సరిపెట్టేశారు



సచివాలయంలో టీడీఆర్ బాండ్ల దరఖాస్తులను పరిశీలిస్తున్న ప్లానింగ్ కార్యదర్శులు



గిరీష్‌కుమార్‌కు చెందిన కారు

అమెరికా వెళ్లాల్సి ఉండగా..

● రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌కు తీవ్ర గాయాలు

● రెండు కార్లు ఢీకొన్న ఘటనలో గాయపడ్డ ఐదుగురు



చికిత్స పొందుతున్న మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): అమెరికా వెళ్లేందుకు ఇంటి నుంచి పయనమైె మధ్యలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ స్థితికి చేరుకున్నారు. రెండు కార్లు ఢీకొన్న ఈ ఘటనలో ఐదుగురు గాయపడిన ఘటన శ్రీకాళహస్తి శివారు వీఎంపల్లె వద్ద ఆదివారం మధ్యాహ్నం జరిగింది. శ్రీకాళహస్తి టూటౌన్ సీఐ వెంకటేష్ తెలిపిన ప్రకారం.. శ్రీకాళహస్తి మండలం అమ్మపాళెంకు చెందిన మధుసూదన్‌రెడ్డి(42) అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. సోమవారం ఉదయం చెన్నై విమానాశ్రయం నుంచి అమెరికా వెళ్లాలి. తన సోదరి కుటుంబాన్ని కలిసి సోమవారం విమానం ఎక్కేందుకని ఆదివారం నెల్లూరుకు కారులో బయలుదేరారు. ఇక, ఒంగోలుకు చెందిన కార్పెంటర్ ప్రభుదాస్ అల్లుడు గిరీష్ కుమార్ ఇటీవల సివిల్ ఇంజనీరింగ్ పూర్తి చేశాడు. దీంతో శ్రీవారి దర్శనార్థం వీరు కుటుంబంతో కలిసి కారులో కారులో బయలుదేరారు. ఆదివారం మధ్యాహ్నం శ్రీకాళహస్తి సమీపం వీఎంపల్లె వద్దకు చేరుకున్నారు. అదే సమయంలో అమ్మపాళెం నుంచి నెల్లూరుకు వెళుతున్న మధుసూదన్‌రెడ్డి కారు టైరు పంక్చరవడంతో జాతీయ రహదారి డివైడర్‌ను దాటి అవతలివైపునకు దూసుకొచ్చి.. తిరుపతి వైపు వెళ్తున్న ప్రభుదాస్ కారును ఢీకొట్టింది.రెండు కార్లలోని క్షతగాత్రులను స్థానికులు శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మధుసూదన్‌రెడ్డి పరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబ సభ్యులు కరకంబాడి వద్ద ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మరో కారులోని ప్రభుదాస్, అతడి కుమారుడు స్వామి, భార్య హర్షిత, అల్లుడు గిరీష్‌కుమార్, మరో బాలుడు సాయిరాఘవ శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గిరీష్‌కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.



దెబ్బతిన్న మధుసూదన్‌రెడ్డి కారు

ఇంకా ఎన్ని ఉన్నాయో?



● మూడు నెలలుగా హడలెత్తించి బోనుకు చిక్కిన చిరుత



వేదిక్ యూనివర్సిటీలోని బోనులో చిక్కిన చిరుతను పరిశీలిస్తున్న అధికారులు

ఇంకా ఎన్ని చిరుతలు ఉన్నాయ్?

...ఇదీ మూడు వర్సిటీల విద్యార్థులు, అటవీశాఖ అధికారులను వేధిస్తున్న ప్రశ్న. మూడు నెలలుగా హడలెత్తించిన చిరుత బోనుకు చిక్కడంతో ఒకవైపు ఊపిరి పీల్చుకున్నా.. మరోవైపు ఇంకా ఎన్ని ఉన్నాయనేది ఆందోళన కలిగిస్తోంది.

శేషాచల అటవీప్రాంతంలో ఎన్ని చిరుతల ఉన్నాయనే దానిపై అటవీశాఖ అధికారుల వద్ద ఇప్పటికీ ఖచ్చితమైన సమాచారం లేదు. ఏ ప్రాంతంలో ఎక్కువగా సంచరిస్తున్నాయనేదీ తేలడంలేదు. కానీ, చిరుతల సంఖ్య గణనీయంగా పెరిగిందనేది వాస్తవం. 40కిపైగా ఉండొచ్చన్న అంచనా తప్ప, స్పష్టమైన లెక్క లేదు. సాధారణంగా ప్రతి రెండేళ్లకోసారి చిరుతల గణన చేయాలి. అవి ఎక్కువగా సంచరించే ప్రాంతాల్లో కొంత మంది సిబ్బంది వాటి పాదముద్రలు, వెంట్రుకలు, మలం సేకరణతో పాటు ట్రాప్ కెమెరాల ద్వారా ఎన్ని చిరుతలు ఉన్నాయనే అంచనా వేస్తారు. ఈ క్రమంలో అటవీశాఖ అధికారులు శాంచరీ ఏరియాలోని తిరుమల, కరకంబాడి, మామండూరులో ఒక్కో బీట్‌లో పది చొప్పున 12 బీట్లలో 120 ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేశారు. అంటే రిజర్వు ఫారెస్టులో కాకుండా అటవీప్రాంతం వెలుపలా చిరుతలు తిరిగే ప్రాంతాలను గుర్తించి వీటిని అమర్చారు. ఒక్కో కెమెరా మధ్య దూరం 100 మీటర్లు. మార్చినెల 10న ఏర్పాటు చేసిన ఈ కెమెరాలను ఈనెల 20వ తేదీ వరకు నిఘాలో ఉంచుతారు. ఆ తర్వాత వీటిని తీసి పరిశీలిస్తారు. ట్రాప్ కెమెరాలకు చిక్కిన చిరుతల ఆనవాళ్ల ఆధారంగా అవి ఎన్ని ఉన్నాయనే దానిపై ఒక అంచనాకు వస్తారు. ఈ కెమెరాలను శాంచరి ఏరియాలో మాత్రమే ఏర్పాటు చేయడంతో పూర్తిస్థాయిలో చిరుతల సంఖ్య తేలే అవకాశం లేదు. ఇప్పటికైనా అటవీశాఖ అధికారులు చిరుతల గణనగురించి ఒక ప్రణాళికతో ముందుకు వెళితే తప్ప వాటి సంఖ్య తెలిసే అవకాశం లేదు.

ఇది సంతాన అభివృద్ధి సమయం

ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ వరకు చిరుతలు తమ సంతానాన్ని అభివృద్ధి చేసుకుంటాయి. ఈ సమయంలో తమ పిల్లలకు దూరంగా వెళ్లకుండా, ఆహారాన్ని సులభంగా వేటాడి తెచ్చుకునేలా అనువైన ప్రాంతాలను ఎంచుకుంటాయి. అటవీప్రాంతానికి ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో చిరుతలకు సులభంగా దొరికే శునకాలు, చిన్న చిన్న జీవాలపై దాడి చేస్తాయి వాటిని తమ పిల్లలకు ఆహారంగా తీసుకెళతాయి. ఈ లెక్కన గత కొంతకాలంగా చిరుతలు సంచరిస్తున్న ప్రాంతాలను పరిశీలిస్తే అటు వేద వర్సిటీ నుంచి ఎస్వీయూ, వెటర్న యూనివర్సిటీలు, వ్యవసాయ కళాశాల, నగరవనం, జీవకోన, తిమ్మినాయుడుపాలెం, మంగళం, కరకంబాడి ప్రాంతాల్లోను.. తిరుమల నడక మార్గంలోని ఏడో మైలు నుంచి నరసింహస్వామి ఆలయం వరకు చిరుతల సంచారం ఎక్కువగా ఉండటం గమనార్హం. నడక మార్గంలో చిన్నారులపై చిరుత దాడి ఘటనల తర్వాత ఏడో మైలు, నరసింహస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన బోన్లలో ఐదు చిరుతలు పట్టుబడ్డాయి. గతంలో వెటర్నరీ వర్సిటీ వద్ద ఒకటి, మంగళం వద్ద ఒకటి బోన్లకు చిక్కాయి. ఇపుడు తాజాగా వేద వర్సిటీ వద్ద చిరుత బోనులో పడింది.

అప్పుడప్పుడూ బోన్లు పెట్టి..

అటవీప్రాంతం నుంచి చిరుతలు సమీప ప్రాంతాల్లో శునకాలపై దాడి చేసినప్పుడు, ప్రజలు భయాందోళనకు గురైనప్పుడు తాత్కాలిక ఉపశమనంకోసం బోన్లను ఏర్పాటు చేస్తున్నారు. పట్టుబడ్డ వాటిని సుదూర ప్రాంతంలో వదిలేస్తున్నారు. ఇలా, తాజాగా ఎస్వీయూ, వెటర్నరీ, వేద వర్సిటీలు, క్వార్టర్స్‌లో ఉన్న వారికి మూడు నెలలుగా ఓ చిరుత కంటిమీద కునుకు లేకుండా వణికించింది. వర్సిటీలలో రాత్రి పూట సంచరిస్తూ పెంపుడు, వీధి కుక్కలు, జింకలపై దాడి చేస్తూ భయానక వాతావరణాన్ని సృష్టించింది.ఈ నేపథ్యంలో అటవీశాఖ అధికారులు ట్రాప్ కెమెరాలను, ఐదు బోన్లను ఏర్పాటు చేశారు. వేద వర్సిటీ శారదమ్మబిల్డింగ్ వద్ద ఏర్పాటు చేసిన బోన్‌లో ఆదివారం తెల్లవారుజామున ఓ చిరుత పట్టుబడింది. ఇది ఆడ చిరుతని అధికారులు తెలిపారు. చిరుతను పరిశీలించిన ఎస్వీ జూపార్కు డాక్టర్ అరుణ కుమార్ ఆరోగ్యంగా ఉందని చెప్పడంతో దీనిని అటవీశాఖ అధికారులు చిట్వేలు అటవీ ప్రాంతంలో వదలిపెట్టారు. ఇది ఈ ప్రాంతవాసులకు కొంత ఊరట కలిగినా ఇంకా ఎన్ని సంచరిస్తున్నాయనే ఆందోళనలో ఉన్నారు.

- మంగళం, ఆంధ్రజ్యోతి

రామనామమే మధురంగా..!



సీతా లక్ష్మణ సమేత శ్రీరాముడికి స్నపన తిరుమంజనం

● ఘనంగా శ్రీరామనవమి వేడుకలు



కోదండరాముడి దర్శనానికి బారులు తీరిన భక్తులు

తిరుపతి(టీటీడీ), ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): శ్రీరామ నామం మధురం.. అంటూ జిల్లాలో ఆదివారం శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఊరూరా రామమందిరాలు భక్తులతో సందడిగా మారాయి. తిరుపతిలోని కోదండరామ స్వామి ఆలయంలోని ఊంజల మండపంలో ఉదయం 8-9 గంటల మధ్య సీతారామ లక్ష్మణ సమేత హనుమంతుడి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పెద్దజీయర్ స్వామి మఠం నుంచి అర్చకులు నూతన వస్త్రాలను తీసుకొచ్చి మూలవర్లకు, ఉత్సవర్లకు సమర్పించారు. ఆ తర్వాత శ్రీరామ జన్మపురాణం, ఆస్థానం నిర్వహించారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు హనుమంతుడిపై కొలువుదీరిన శ్రీరామచంద్రమూర్తి నాలుగు మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఇక, ఆలయంలో భక్తులకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. భక్తులకు నిరంతరాయంగా వడపప్పు, పానకం పంపిణీ చేశారు. ఆలయం లోపల భక్తులు రామకోటి రాశారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో రవి, సూపరింటెండెంట్ మునిశంకర్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సురేష్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



హనుమంత వాహనంపై ఊరేగుతున్న శ్రీరామచంద్రమూర్తి

నేడు 9గంటలకే పీజీఆర్ఎస్

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌తో పాటు డివిజనల్, మండల కేంద్రాల్లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం ఉదయం 9గంటలకే ప్రారంభమవుతుందని కలెక్టర్ వెంకటేశ్వర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి అధికారులు హాజరై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించాలన్నారు. ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.



ఇంటర్ ప్రవేశాలకు వేళాయె

● పది ఫలితాలు రాకున్నా ప్రవేశం

● నేటి నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో దరఖాస్తుల ప్రక్రియ

జిల్లాలో ప్రభుత్వ
జూనియర్ కళాశాలలు: 21
ఎయిడెడ్ : 1
హైస్కూల్ ప్లస్ : 29
మొత్తం : 51

తిరుపతి(విద్య), ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): నూతన విద్యావిధానం అమల్లో భాగంగా ఈనెల ఒకటి నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు తరగతులు ప్రారంభమయ్యాయి. ఈనెల 23 వరకు తరగతులు కొనసాగుతాయి. 24 నుంచి మే 30వ తేదీ వరకు వేసవి సెలవులు. జూన్ ఒకటిన కళాశాలలు పునఃప్రారంభం కానున్నాయి. సాధారణంగా పదోతరగతి పరీక్షల ఫలితాల అనంతరం ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలు ప్రారంభిస్తారు. పదతరగతి మూల్యాంకనం ఈనెల 3నుంచి 9వ తేదీ వరకు సాగుతుంది. ఆతర్వాతే ఫలితాలు వెలువడనున్నాయి. కానీ, సోమవారం నుంచే ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు జారీ చేస్తున్నారు. పదవ తరగతి ఫలితాలతో సంబంధం లేకుండా పాస్ అవుతామనే ధీమా ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

మధ్యాహ్న భోజనం వరం

మధ్యాహ్న భోజనం పథకాన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనూ అమలుచేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం గ్రామీణ విద్యార్థులకు వరంలా మారింది. 2014లో తెలుగుదేశం ప్రభుత్వం జూనియర్ కళాశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ప్రారంభించగా.. గత వైసీపీ ప్రభుత్వం రద్దు చేసింది. దీంతో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలు తగ్గుముఖం పట్టాయి. ఈ ఏడాది నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనూ డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్న నేపథ్యంలో ప్రవేశాలు పెరగవచ్చని ఇంటర్ బోర్డు అధికారులు అంచనా వేస్తున్నారు. 2024-25 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో సుమారు 10 వేల మంది విద్యార్థులు ఉన్నారు.

హాల్ టికెట్ జతచేసి దరఖాస్తు చేసుకోవాలి

ప్రభుత్వ కళాశాలల్లో అనుభవజ్ఞులైన అధ్యాపకులతో, ఒత్తిడిలేని విద్యా బోధన ఉంటుంది. ఫీజుల భారం ఉండదు. మధ్యాహ్న భోజనం కూడా అందిస్తాం. పదో తరగతి ఫలితాలు రాకున్నప్పటికీ ఇంటర్‌లో చేరవచ్చు. పదోతరగతి పరీక్షల హాల్ టికెట్‌ను జత చేసి దరఖాస్తు చేసుకోవాలి.

- ప్రభాకర్‌రెడ్డి, ఆర్ఐవో, తిరుపతి జిల్లా



భక్తులకు కొడిముద్దలు, వస్త్రదానం చేస్తున్న పండితులు

సంగమేశ్వరస్వామి ఆలయంలో ధ్వజారోహణం



ధ్వజస్తంభానికి కొడివస్త్రం కడుతున్న భక్తులు

కోట, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడలిలో గల కామాక్షీదేవి సమేత సంగమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ధ్వజారోహణం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు కార్తిక్‌శర్మ భక్తుల సమక్షంలో పురాతన ధ్వజస్తంభానికి కొడి వస్త్రాన్ని కట్టారు. స్వామివారి కొడి ముద్దలను భక్తులకు పంపిణీ చేశారు. మహిళా భక్తులకు పసుపు, కుంకుమ, రవికెలు పంపిణీ చేశారు.

చెన్నకేశ్వరస్వామి గ్రామోత్సవం



గంధంతో గ్రామోత్సవం జరుపుతున్న గ్రామస్తులు

కోట, ఏపి్రలల్ 6(ఆంధ్రజ్యోతి): కోట దళితవాడలోని శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశ్వరస్వామి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి స్వామివారి గంధోత్సవంతో గ్రామోత్సవం నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల కల్యాణానికి ముందు ఊరేగించిన గంధంతో నలుగులు పెట్టి ముస్తాబు చేశారు.

ఘనంగా గంగాప్రసాద్ జన్మదిన వేడుకలు



కేక్‌కట్ చేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం, సుధాకర్‌రెడ్డి, రమేష్, కిషోర్, మాధవనాయుడు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో టీడీపీ నేత కొండేపాటి గంగాప్రసాద్ జన్మదిన వేడుకలను ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ఆధ్వర్యంలో నిర్వహించారు. తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాల్లోని 25 ప్రభుత్వ పాఠశాలలకు రూ.5లక్షల విలువ గల విద్య, క్రీడా సామగ్రిని ఆయా మండలాల ఎంఈవోలకు అందజేశారు. సూళ్లూరు పేట అంబేడ్కర్ బాలికల గురుకులానికి నాలుగు ఇన్వర్టర్లను అందజేశారు. పట్టణంలోని పలు ప్రాంతాలకు ఉచితంగా మంచినీరు సరఫరా చేసేందుకు ట్యాంకులను కోళ్లమిట్టలో ఎమ్మెల్యే ప్రారంభించారు. అంతకుముందు గంగాప్రసాద్ ఇంటి వద్ద ఎమ్మెల్యేతో పాటు మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. మధ్యాహ్నం బాపూజీ గిరిజన కాలనీలో పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, మాధవనాయుడు, బొమ్మన్ శ్రీధర్, సంచి కృష్ణయ్య, కొక్కు శంకరయ్య, బొమ్మన్ పళణి, సురేష్ నాయుడు, అలవల శ్రీనివాసులు పాల్గొన్నారు.

గ్రామీణ కళాకారులు ఐకమత్యంగా ఉండాలి



కళాకారుల సమావేశంలో మాట్లాడుతున్న సుందరరామరాజు

నాయుడుపేట, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ కళాకారులంతా ఐకమత్యంగా ఉంటే అభివృద్ధి సాధించవచ్చని నేతాజీ కళావేదిక వ్యవస్థాపకుడు సుందరరామరాజు అన్నారు. నాయుడుపేట శ్రీవేమ జూనియర్ కళాశాలలో ఆదివారం వివిధ కళాకారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఉన్న వివిధ రంగాల గ్రామీణ కళాకారులకు ప్రోత్సాహం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మన సంస్కృతికి చిహ్నాలైన చెక్క భజనలు, కోలాటం, హరికథ, బుర్రకథ, తోలు బొమ్మలాట, బోయి నృత్యాలు, జానపద నాటకాలు వంటివి వాటిని సంరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో నరసింహమూర్తి, రామచంద్రయ్య, గౌరీ రాజారెడ్డి, పెంచలమ్మ, కమలమ్మ, మస్తానమ్మ, చెంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల, ఏప్రిల్6 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 30 కంపార్టుమెంట్లలో సర్వదర్శన, వైకుంఠం క్యూకాంప్లెక్స్ 1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు. శుక్రవారం హుండీ ఆదాయం రూ.3.60 కోట్లు లభించింది.

కేంద్ర, రాష్ట్రాల్లో సుపరిపాలన
హోంమంత్రి అనిత



ఆలయం ముందు హోంమంత్రి అనిత

తిరుమల, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): కేంద్రం, రాష్ట్రంలో రామరాజ్యం కొనసాగుతోందని, ప్రజలు సంతోషంగా ఉన్నారని హోంమంత్రి అనిత అన్నారు. తిరుమల శ్రీవారిని ఆదివారం దర్శించుకున్న ఆమె ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. శ్రీరామనవమి రోజున శ్రీవారిని దర్శించుకోవడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని తెలిపారు. 2047 విజన్‌కు సీఎం చంద్రబాబు దీక్ష పూనారని, పీ4 విధానంలో బంగారు కుటుంబాలను అభివృద్ధిలోకి తీసుకురావాలని కంకణం కట్టుకున్నారని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా సక్రమంగా పూర్తికావాలని శ్రీవారిని కోరుకున్నానని చెప్పారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

కాళంగిలో స్నానానికి దిగి ఒకరి మృతి

సూళ్లూరుపేట, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట చెంగాళమ్మ ఆలయ సమీపంలో ఉన్న కాళంగి నదిలోకి స్నానానికి వెళ్లి వెలుగోటి వెంకటేశ్వర్లు (41) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు.. పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన వెంకటేశ్వర్లు ఆదివారం మధ్నాహ్నం ఎండవేడిమి నుంచి సేద తీరేందుకు కాళంగి నది వంతెన సమీపంలో స్నానానికి దిగి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని వెలికితీసి పోస్టు మార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెళ్లకూరు చర్చిలో చోరీ

పెళ్లకూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు ఎస్సీ కాలనీలోని చర్చిలో చోరీ జరిగింది. శనివారం రాత్రి దుండగులు చర్చిలోకి ప్రవేశించి ప్రార్థనకు ఉపయోగించే మైకొసెట్, డీజే బాక్సులను ఎత్తుకెళ్లారు.

ఉరుసు ఉత్సవాలు జయప్రదం

నాయుడుపేట, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): హిందూ.. ముస్లింల ఐక్యతకు ప్రతీక అయిన హజరత్ అమీర్‌షావలి గంధోత్సవ ఉరుసు ఉత్సవాలు విజయవంగా నిర్వహించామని ఉరుసు కమిటీ అధ్యక్షుడు నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. దర్గా వద్ద ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు.

కమనీయం.. రాములోరి కల్యాణం





సీతారాముల మంగళసూత్రాన్ని చూపుతున్న వేదపండితులు - కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలాంజనేయ స్వామి ఆలయంలో శ్రీరామనవమి వసంతోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం శ్రీరామనవమి పురష్కరించుకొని నిర్వహించిన సీతారాముల కల్యాణ మహోత్సవం కనుల పండువగా జరిగింది. ఆలయ ప్రాంగణంలో కల్యాణ వేదిక ఏర్పాటు చేసి వేద మంత్రోచ్చరణ నడుమ సీతారాముల ఉత్సవ మూర్తులను ప్రదర్శనగా కల్యాణ వేదిక వద్దకు తీసుకొచ్చి కొలువుదీర్చారు. అనంతరం ఉత్సవ మూర్తులు విశేషాలంకరణతో పెళ్లి పీటలపై ఆశీనులవగా వేదపండితులు కల్యాణ ఘట్టాన్ని జరిపించారు. నేత్రపర్వంగా సాగిన రాములోరి కల్యాణాన్ని భక్తులు కనులారా తిలకించారు. అశేష భక్తజనం నడుమ సీతారాముల శిరస్సుపై జీలకర్ర బెల్లం మిశ్రమాన్ని పెట్టారు. అనంతరం అభిజిత్ లగ్నంలో రామయ్య సీతమ్మ మెడలో మాంగళ్య ధారణ చేశారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం, టీడీపీ జిల్లా కార్యదర్శి వేనాటి సతీష్ రెడ్డి, తిరుమూరు సుధార్ రెడ్డి, ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, మాధవనాయుడు విచ్చేసి సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని తిలకించారు. అదే విధంగా బ్రాహ్మణ వీధిలో ఉన్న సీతారాముల ఆలయం, పార్కువీధిలోని మద్వేంకట రామ్మూర్తి స్వామి ఆలయాల్లో కూడా శ్రీరామనవమి వేడుకలను పురష్కరించుకొని సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు కారంశెట్టి మల్లికార్జున, బీరక రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతానికి గంగాప్రసాద్ కృషి ఎనలేనిది: పాశిం



కేక్‌కట్ చేస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): గూడూరు డివిజన్‌లో టీడీపీ బలోపేతానికి ప్రముఖ పారిశ్రామికవేత కొండేపాటి గంగాప్రసాద్ చేస్తున్న కృషి ఎనలేనిదని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం కొండేపాటి గంగాప్రసాద్ పుట్టిరోజు సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ గంగాప్రసాద్ సహాయ సహకారాలతోనే తాను ఎమ్మెల్యేగా గెలిచానని, ఆయన చేసిన సాయాన్ని ఎన్నటికీ మరిచిపోలేనన్నారు. టీడీపీ కార్యకర్తలకు ఎప్పుడు ఏ కష్టం వచ్చినా గంగాప్రసాద్ అండగా నిలుస్తున్నారన్నారు. అనంతరం సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుప్పట్లు అందజేశారు. అన్నదానం చేశారు. కార్యక్రమంలో పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, వాటంబేడు శివకుమార్, ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి, రవీంద్రరెడ్డి, నాగసూరు గోపాల్‌రావు, అల్లీహుస్సేన్, భారతి, సుబ్బమ్మ, కల్పన, చరణ్, సునీల్, వెంకటసాయి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా రేణిగుంటలోని అభయ క్షేత్రంలో గంగాప్రసాద్ పుట్టిరోజు సందర్భంగా టీడీపీ పట్టణ ఉపాధ్యక్షుడు ఆరికట్ల మస్తాన్ నాయుడు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

పేదల సంక్షేమమే బీజేపీ ధ్యేయం



గూడూరులో బీజేపీ జెండా ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు

గూడూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజల సంక్షేమమే బీజేపీ ధ్యేయమని ఆ పార్టీ పట్టణాధ్యక్షుడు దయాకర్ అన్నారు. ఆదివారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ కార్యాలయంలో జెండా ఎగురవేసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఆరికట్ల బాలకృష్ణమనాయుడు, శ్రీనివాసరావు, సురేష్ బాబు, నరేంద్ర, జీవీనాయుడు, బాలకృష్ణ, రవీంద్రబాబు, వెంకటేష్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: పట్టణంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తిరాల కిరణ్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండు వద్ద నుంచి రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న బీజేపీ కార్యాలయం వరకు మోటర్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తాటిపర్తి ఆదినారాయణ రెడ్డి, కోటయ్య గౌడ్, వాసుకుమార్, శ్రీనివాసులు, బెజవాడ విజయమ్మ, నూతలపాటి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పెళ్లకూరు: మండలంలోని పెన్నేపల్లి గ్రామంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు కలిచేటి నరసింహులు నాయకులు, కార్యకర్తలతో కలసి జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు గోగుతట్టు మురళి, మద్దాలి వీరయ్య, భరత్ కుమార్, రమణయ్య, నరసయ్య, పాపయ్య, కృష్ణ, లక్ష్మి, వరలక్ష్మి, బుజ్జమ్మ, కవిత తదితరులు పాల్గొన్నారు.

తడ: బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు చిల్లకూరు తేజారెడ్డి ఆధ్వర్యంలో అక్కంపేట నుంచి తడ వరకు పార్టీ కార్యకర్తలతో కలిసి అభిమానులు బైక్ ర్యాలీ నిర్వహించారు. అక్కంపేటలో పార్టీ కార్యాలయం వద్ద జెండాను ఆవిష్కరించారు. కేక్, మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాచర్ల కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా సీతారాముల నగరోత్సవం





6 ఎన్‌పేట 5: నగరోత్సవ రథాన్ని లాగుతున్న నెలవల, తదితరులు - ప్రత్యేక పుష్పాలంకరణలో సీతారాములు

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బజారువీధిలో వెలసిన రామమందిరంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని సీతారామ, లక్ష్మణులకు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం సీతారామ, లక్ష్మణులను ప్రత్యేక పుష్పాలతో అలంకరించి నగరోత్సవం నిర్వహించారు. ముందుగా చిదానంద మహారాజ్ కొబ్బరికాయ నగరోత్సవాన్ని ప్రారంభానికి ప్రారంభించారు. సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, నాయకులు, భక్తులు నగరోత్సవ రథాన్ని లాగారు. చాగణం సుమన్, రేష్మా దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఈవో రవికృష్ణ, దూవా కామిరెడ్డి రాజారెడ్డి, రఫీ, నెలవల రాజేష్, బిరదవాడ శ్రీనివాసులు, గోపీ, సిద్ధయ్య, దువ్వూరు మధుసూదన్‌రెడ్డి, సుబ్బారావు, నారాయణ, రవి, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకి భంగపాటు తప్పదు: నేదురుమల్లి

వెంకటగిరి టౌన్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి మున్సిపాలిటీలో ఈ నెల తొమ్మిదవ తేదీన అవిశ్వాస తీర్మానంలో టీడీపీకి భంగపాటు తప్పదని వైసీపీ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వెంకటగిరి మున్సిపాలిటీలో వైసీపీకి 25 మంది కౌన్సిలర్లు ఉండగా కొందరిని టీడీపీ ప్రలోభపెట్టిందన్నారు. ఇంకా 19 మంది కౌన్సిలర్లు తమ వైపే ఉన్నారని తెలిపారు. 9న అవిశ్వాస తీర్మానాన్ని ఎదుర్కొని విజయం సాధిస్తామని రాంకుమార్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

విద్యార్థినులకు దుప్పట్లు పంపిణీ



విద్యార్థినులకు దుప్పట్లు అందజేస్తున్న ప్రగతిసేవాసంస్థ సభ్యులు

గూడూరు అర్బన్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాలసదనంలో విద్యార్థినులకు ప్రగతిసేవాసంస్థ ఆధ్వర్యంలో దుప్పట్లు, విద్యాసామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ బాలసదనం వసతిగృహంలో చదివే విద్యార్థినులకు తమ సంస్థ ఆధ్వర్యంలో వసతులు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జీ.చంద్రశేఖర్, శ్రీనివాసులు, మురళీ నాయుడు, దయాకర్, నారాయణ, నాగరాజు, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గిన్నిస్ బుక్ రికార్డు గ్రహీతకు సీఎం అభినందనలు

వెంకటగిరి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): యోగాలో గిన్నిస్ బుక్ రికార్డు సాధించిన వెంకటగిరికి చెందిన చింతగింజల వసంతలక్ష్మిని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభినందించారు. గతేడాది డిసెంబరులో 3.42 గంటల పాటు సమకోణాసనం వేసి వసంతలక్ష్మి గిన్నిస్ బుక్ రికార్డు సాధించారు. శనివారం అమరావతిలోని సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వసంతలక్ష్మికి జ్ఞాపిక అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో పద్మశాలి కార్పొరేషన్ చైర్‌పర్సన్ నందం అబద్దయ్య, పద్మశాలి ఉద్యోగ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



వసంతలక్ష్మికి జ్ఞాపిక అందజేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు





గూడూరులోని సాయిసత్సంగ నిలయంలో సీతారాముల కల్యాణం - పెళ్లకూరు మండలం జీలపాటూరులో సీతారాములకు పూజలు

వైభవంగా శ్రీరామనవమి వేడుకలు

గూడూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ఆలయాల్లో శ్రీరామనమి వేడుకలు వైభవంగా జరిగాయి. సాయిసత్సంగ నిలయంలోని విజయదుర్గాదేవి ఉపపీఠంలో విజయదుర్గాదేవికి నవావరణ హోమ పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకుడు కోట సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో సీతారాములను ప్రత్యేకంగా అలంకరించి వేదపండితుల మంత్రోచరణల నడుమ కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా జరిపారు. అలాగే సాయిబాబా మందిరంలో సీతారాముల కల్యాణాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. అలాగే కోనేటిమిట్ట కోదండరామాంజనేయస్వామి ఆలయం, రాజావీధిలోని రామమందిరంలో శ్రీరామనమి వేడుకలు జరిగాయి.

చిల్లకూరు: మండలంలోని తమ్మినపట్నం గ్రామంలో వెలసిన కోదండ రామస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం కన్నుల పండువగా జరిగింది. ఉదయం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి వేదపండితుల మంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల నడుమ సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. రాత్రికి సీతారాములను గజవాహ నంపై ఉంచి గ్రామోత్సవం జరిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సతీష్ యాదవ్, ఈవో గిరికృష్ణ, టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు రెడ్డి, మునిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పెళ్లకూరు: మండలంలోని జీలపాటూరు రామాలయంలో ఆలయ ప్రధాన అర్చకుడు ప్రశాంత్‌శర్మ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం నిర్వహించారు. గ్రామానికి చెందిన శిరసనంబేటి మధుసూదనరెడ్డి భక్తులకు అన్నదానం చేశారు. అలాగే పెళ్లకూరు, కొత్తూరు, టెంకాయతోపు, చెంబేడు, చెన్నప్పనాయుడు గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలు నిర్వహించారు.

తడ: మండలంలోని బోడిలింగాలపాడు వద్ద ఉన్న సీతారామాంజనేయస్వామి ఆలయంలో శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మొదట రుద్రాభిషేకం చేశారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య సీతారాముల కల్యాణం వేడుకగా నిర్వహించారు. నిప్పో పరిశ్రమ యాజమాన్యం స్వామివార్లకు పట్టువస్త్రాలను సమర్పించింది. పరిశ్రమ ఎండీ ద్వారకనాథరెడ్డి సౌజన్యంతో 3వేల మందికి అన్నప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో నిప్పో పరిశ్రమ హెడ్ నాగరాజు, హెచ్‌ఆర్ రమేష్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

నాయుడుపేట టౌన్: పట్టణంలోని రాజగోపాలపురంలో వెలసిన లక్ష్మణ సమేత సీతారామాంజనేయస్వామి ఆలయంలో శ్రీరామనవమి మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. అలాగే బజారువీధి, శివాలయంవీధి, అగ్రహారపేట, తుమ్మూరులో ఉన్న రామమందిరాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

బాలాయపల్లి: మండలంలోని బాలాయపల్లి, వెంకటరెడ్డిపల్లి, నిండలి, జయంపు, అంబలపూడి, పిగిలాం గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలు జరిగాయి. పూజలు నిర్వహించి భక్తులు తీర్థ ప్రసాదాలను పంచిపెట్టారు.

కోట: మండల పరిధిలోని చిట్టేడు, శ్యామసుందరపురం, కోటలో శ్రీరామనవమి పర్వదినాన్ని గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. గోవిందపల్లె పాళెం మత్స్యకార గ్రామంలో సీతారాముల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. కొత్తపట్నం పంచాయతీలోని మత్స్యకార గ్రామాల ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం నిర్వహించి గ్రామోత్సవం చేశారు.





చిల్లకూరు: మంగళసూత్రం చూపుతున్న వేదపండితులు - సీతారాముల కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

రామాయణం జీవిత విలువలను తెలియజేస్తుంది

తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): రామాయణంలోని ఏడు కండాలు జీవిత విలువలను తెలియజేస్తాయని ఎస్పీడబ్ల్యూ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణమ్మ పేర్కొన్నారు. శ్రీరామ నవమి సందర్భంగా అంతర్జాతీయ అంతర్జాల కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. శ్రీపద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల తెలుగు విభాగం, సింగపూర్ తెలుగు సమాజం, మలేషియా తెలుగు సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రామాయణ కావ్యంలోని ధర్మాలను లోకానికి తెలియజేయడం ప్రస్తుత కాలానికి ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో రామాయణ హరినాథరెడ్డి, డాక్టర్ వి.కృష్ణవేణి హాజరయ్యారు.